J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 46 సంచిక : 11 14.8.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## 'ఢీ' ఎస్సీ

## ప్రభుత్వంపై ఉక్రోషం

## రాజకీయ నిరుద్యోగుల ఆక్రోశం

### టీచర్ల నియామకాలపై.. గాలి పోగుచేసి గోల

### లేనిది ఉన్నట్లుగా దుష్ప్రచారం

### జెన్‌జీ ముసుగులో పార్టీ శ్రేణులు

### ఉద్యమంలో కనిపించని యువత

**ఒక అబద్ధాన్ని పదేపదే చెప్తే అది నిజమైపోతుందని, ఒక అంశాన్ని అదేపనిగా జనంపై రుద్దితే నమ్మేస్తారని కొందరు భ్రమిస్తుంటారు. అయితే ఎన్ని రకాలుగా ప్రయత్నించినా, ఎలాంటి వ్యూహాలు పన్నినా నిజం ఎప్పటికైనా నిజమే. అబద్ధం ఎప్పటికైనా అబద్ధమే. సరిగ్గా ఇదే సూక్తి ప్రస్తుతం రాష్ట్రంలో డీఎస్సీ నియామకాలపై జరుగుతున్న గందరగోళానికీ వర్తిస్తుంది. ఎందుకంటే ఏళ్లకేళ్లు కష్టపడి, రాత్రింబవళ్లు శ్రమించి.. అప్పులు చేసి.. ఆస్తులమ్ముకుని కోచింగ్ సెంటర్లలో అష్టకష్టాలుపడి ఉద్యోగాలు సాధించిన ఎందరో కొత్తగా ఎంపికైన టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రస్తుతం సాగుతున్న దుష్ప్రచారం ఎంతమాత్రం సమర్ధనీయం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.**

అత్యంత పకడ్బందీగా "టెట్" (టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు) నిర్వహించి మార్కుల జాబితాను సిద్ధం చేసి, వాటిలో డీఎస్సీ పరీక్షకు వెయిటేజీ(20 శాతం వరకు)తో ఖరారు చేశారు. తర్వాత 16వేలకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, రిజర్వేషన్లు నిర్ణయించి కేటగిరీల వారీగా పోస్టులను విభజించి కేవలం 3 నెలల వ్యవధిలోనే డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. ఇది ఆషామాషీ వ్యవహారమేం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో మెరిట్ లిస్టు విడుదల చేసి, నియామకాలు పూర్తయ్యి టీచర్ ఉద్యోగాలు చేస్తున్న వారిని దొంగలుగా చిత్రిస్తూ.. పోస్టులను అమ్ముకున్నారంటూ గాలిపోగుచేసి గోల చేయడం వైఎస్సార్‌సీపీకే చెల్లిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమౌతోంది.




### అన్యాయమైపోయిన ఒక్క అభ్యర్థినైనా..!

డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, మెగా డీఎస్సీపేరుతో దగా డీఎస్సీ నిర్వహించారంటూ కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆరోపిస్తోంది. అర్హులకు అన్యాయం చేసి, అనర్హులకు ఉద్యోగాలిచ్చారంటూ ఆక్రోశిస్తోంది. పైగా ఉద్యోగాలన్నీ పప్పుబెల్లాల్లా అమ్మేశారంటూ ఆరోపిస్తోంది. అయితే ఎక్కడ అన్యాయం జరిగింది..? ఏ అభ్యర్థి అర్హత ఉన్నా ఉద్యోగానికి దూరమయ్యాడు..? ఎవరు రెకమండేషన్ కోటాలో ఉద్యోగం కొట్టేశారు..? ఎవరు లంచమిచ్చి ఉద్యోగం పొందారు వంటి అంశాలను వదిలిపెట్టి, కేవలం అన్యాయం జరిగింది, అన్యాయం జరిగిందంటూ ప్రచారానికే పరిమిమితం కావడం గమనిస్తే వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆందోళనలన్నీ పార్టీకే పరిమితమై జనానికి దూరమౌవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని

2లో



# గోవిందనామాలను అపహాస్యం చేయడాన్ని సహించం

## • భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం

గోవిందనామాలను అపహాస్యం చేయడాన్ని సహించేది లేదని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 12న ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, శ్రీవేంకటేశ్వరస్వామివారి భక్తుల మనో భావాలు దెబ్బతినేవిధంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాద న్నారు. అనుచితంగా ప్రవర్తించిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఆ ఘటనకి బాధ్యులైనవారు తిరుపతిలోని అలిపిరి వద్దనున్న


సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాశ్‌రెడ్డి

శ్రీవారి పాదాల చెంత క్షమాపణ చెప్పాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయ రెడ్డి, బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై ఉక్రోషం - రాజకీయ నిరుద్యోగుల ఆక్రోశం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 175 నియోజకవర్గాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నా యువజన సమూహం నుంచి కానీ, ఇతర వర్గాల నుంచి కనీస స్పందన కరువైపోవడం దీనికి నిదర్శనంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ చేస్తున్న ర్యాలీలలో అర్హత ఉండీ ఉద్యోగాలు రాని అభ్యర్థులు కాకుండా గత ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయి, పదవులు పోగొట్టుకున్న రాజకీయ నిరుద్యోగులే ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. వారి ప్రచార ఆర్భాటం, ఫొటోల పిచ్చి, రీల్స్ వంటివన్నీ వారి ధర్నా ఉద్దేశాన్ని పక్కదారి పట్టిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం జిల్లాకు ఇద్దరు ముగ్గురు అన్యాయం జరిగిన అభ్యర్థులనైనా తీసుకొచ్చి వారి నేతృత్వంలో యువతను సమీకరించి వారి ఆకాంక్షలను, ఆవేదనను ప్రభుత్వానికి తెలియజస్తే వైఎస్సార్‌సీపీ ర్యాలీలకు కొంతైనా మైలేజ్ వచ్చే అవకాశం ఉండేది. కానీ వాటన్నింటినీ పక్కనబెట్టి కేవలం రాజకీయ ప్రసంగాలు, ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడానికి, గుడ్డకాల్చి మూతిమీద వేసే తరహాలో చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ను ఏకవచనంతో తిడుతూ శాపనార్థాలు పెట్టడం వల్ల ఒనగూరే ప్రయోజనం శూన్యం. స్థానిక ఎన్నికలు త్వరలో రానుండడంతో నిద్రాణమై ఉన్న పార్టీ శ్రేణులను ఎలా గోలా తట్టిలేపే ఉద్దేశమో లేక చంద్రబాబుపై, లోకేష్‌పై ఉన్న పగ, కోపం, ఈర్ష్యను చూపించే క్రమంలోనో జగన్ మొండిగా తప్పటడుగులు వేస్తే భవిష్యత్ మరింత అగమ్యగోచరమయ్యే ప్రమాదం ఉందని ఆ పార్టీలోని కొందరి నాయకులే వ్యాఖ్యా నిస్తుండడం వైఎస్సార్‌సీపీ ఆందోళనల్లోని నిబద్ధతను, సచ్ఛీల తను ప్రశ్నిస్తోంది.

### ఐదేళ్ల పరిపాలనలో ఒక్క డీఎస్సీ అయినా..?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ 2019 నుంచి 2024 మధ్యకాలంలో రాష్ట్రాన్ని ఇష్టారాజ్యంగా పాలించింది. ఈక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు లెక్కకు మిక్కిలి భూకబ్జాలకు పాల్పడ్డారని, అవినీతి అక్రమాలు చేశారని అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఇక గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, తమ పాలనాకాలం మొత్తంలో జగన్ ఒక్క డీఎస్సీ అయినా ఇవ్వలేదని, ఒక్క ఉపాధ్యాయ పోస్టు అయినా భర్తీ కాలేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపించాయి. అయితే, వాటికి కనీసం జవాబిచ్చే పరిస్థితుల్లో కూడా అప్పట్లో వైఎస్సార్‌సీపీ అధిష్టానం లేదు. పైగా తమ వారు క్షేత్రస్థాయిలో చేస్తున్న నిర్వాకాల వల్ల భవిష్యత్‌లో ఏ పరిస్థితి వస్తుందో కూడా అంచనా వేసేందుకు సైతం ఇష్ట పడలేదు. ముఖ్యంగా ప్రజలు తమ ప్రభుత్వంపై ఎలాంటి అభిప్రాయం ఏర్పరుచుకుంటున్నారు. వారి పర్యవసానాలు ఎలా ఉంటాయనే అంశాన్ని సైతం పట్టించుకోలేదు. ఫలితంగా తిలా పాపం తలాపిడికెడు, కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోలుకోలేని విధంగా దెబ్బతింది. కేవలం 11 సీట్లకే పరిమితమై ప్రతిపక్షహోదా కూడా సాధించలేక పోయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావడం, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే ఊహాగానాలు జోరందుకోవడం, డీలాపడివున్న పార్టీ శ్రేణులను ఎలాగైనా మేల్కొలిపి ఉనికి చాటుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలపై పోరాటాలు చేయడం వైఎస్సార్‌సీపీకి ఎంతైనా అవసరమే.

అయితే అధికారంలో వచ్చిన తర్వాత మొదటి సంతకం డీఎస్సీపై చేయడం, ఏకంగా 16 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి యువతలో సానుకూల దృక్పథం ఏర్పడేలా చేసిందనడంలో సందేహం లేదు. పైగా ఏటా డీఎస్సీ నిర్వహిస్తామంటూ అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే సభలో మంత్రి లోకేష్ స్వయంగా ప్రకటించారు. అయితే ఆ విషయాలన్నింటినీ గుర్తించక, తమ హయాంలో యువత పడిన పాట్లను విస్మరించి, కేవలం ప్రచార ఆర్భాటంతో నియామ కాలై నెలలు గడుస్తుంటే ఇప్పుడు డీఎస్సీ నిర్వహణ అక్రమం అంటూ గొంతెత్తడం విమర్శలకు తావిస్తోంది. పైగా ఒకవేళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపాల్సి వస్తే తామే స్వయంగా పోరాడుతామని, పొలిటికల్ పార్టీలను అందులో చేర్చబోమని డీఎస్సీ అభ్యర్థులు సైతం తెల్చిచెబుతుండడం వారిలో వైఎస్సార్ సీపీపై ఉన్న దృక్పథాన్ని తెలియజేస్తోందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

### కోర్టుకు వెళ్లకుండా సభలూ, సమావేశాలతో..!

16 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసిన నేపథ్యంలో డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా, అభ్యర్థులు తగిన వివరాలతో స్వయంగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అయితే, ఎవరైనా అభ్యర్థికి అంత ఆర్థిక పరిస్థితి లేకున్నా, తగిన న్యాయ సహాయం అందే పరిస్థితి కనిపించకున్నా వైఎస్సార్ సీపీ అధిష్టానం అలాంటి అభ్యర్థులందరి తరపున లాయర్లనూ నియమించి పోరాడవచ్చు. నిజంగా డీఎస్సీలో అక్రమాలు జరిగి ఉంటే, న్యాయదేవత సాక్షిగా ప్రభుత్వ తప్పులను ఎండగట్టవచ్చు. అలా కాకుండా కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తల సభలను, సమావేశాలను డీఎస్సీ అభ్యర్థులతో కలిపి కలగాపులగం చేసి ఏకపక్షంగా నిందలు వేయడం, ఆరోపణలు చేయడం వల్ల కొత్తగా ఒనగూరే ప్రయోజనం ఉండదనే విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టానం గుర్తించినట్లు కనిపించడం లేదు. అందుకే డీఎస్సీలో అన్యాయమైన అభ్యర్థులను మచ్చుకైనా నిరసనల్లో ముందు పెట్టకోకుండా, కేవలం నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలతో ప్రభుత్వాధినేతలను దుర్భాషలాడించడం ద్వారా తన రాజకీయ ఉద్దేశాలను బహిరంగంగా చాటుకుంటోం దనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పక్షం రోజులకుపైగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గగ్గోలుపెడుతున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోవడానికి ప్రధాన కారణం కూడా ఇదే అన్న వాదనలూ జోరందుకుంటున్నాయి.

ఏదేమైనా డీఎస్సీ వేలాది మంది అభ్యర్థుల చిరకాల స్వప్నం, జీవితకాలంలో సాధించే అతిపెద్ద విజయం. అలాంటి మహత్తర విషయాలను, గొప్ప విజయాలను పక్కనపెట్టి రాజకీయ స్వార్థం కోసం మొత్తం వ్యవస్థలనే చెరపట్టడం ఏమాత్రం సహేతుకం కాదు. అందుకే ఇప్పటికైనా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు డీఎస్సీపై అర్థరహిత ఉద్యమాలు తగ్గించి తద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా వ్యవహరించాల్సిన అవసరం కనిపిస్తోంది. లేకుంటే భవిష్యత్‌లో ఆ పార్టీ పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారడం ఖాయమని చంద్రబాబు, పవన్ సహా నాయకులంతా హితబోధ చేస్తున్నారు. అలాగే గతంలో జగన్ ప్రభుత్వంలో నానా కష్టాలు పడిన ఉద్యోగులు సైతం ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ సీపీ తన అసంబద్ధ విధానాలను మార్చుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అదే సమయంలో మంత్రి లోకేష్ రాజీనామా చేయాలంటూ మంకుపట్టుతో ఆందోళనలు చేయడం కూడా కోడిగుడ్డుపై ఈకలు పీకడం లాంటిదేనని ఎద్దేవా చేస్తున్నారు. గతంలో గుట్కాబ్యాచ్‌ను, వీధి రౌడీ బ్యాచ్‌ను, నోరుపారేసుకునే నాంచారమ్మలను మంత్రులుగా చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న మంత్రిని, డీఎస్సీతో యువతలో క్రేజ్ సంపాదించుకున్న మంత్రిని ఏకంగా బర్తరఫ్ చేయాలంటూ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా డీఎస్సీలో అక్రమాలు పేరిట నిర్వహిస్తున్న ఆందోళనల్లో నిజమైన నిరుద్యోగుల కంటే రాజకీయ నిరుద్యోగుల హడావుడే అధికంగా ఉందన్నది జగ(న్)మెరిగిన సత్యం..!

## వెన్నెముకకి..

# అపోలోలో అరుదైన చికిత్స


చికిత్స వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో ఇటీవల వెన్నెముకకి సంబంధించి ఓ వ్యక్తికి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. ఈనెల 12న ఆ ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ వెంకట్, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్‌హెడ్ విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరుకు చెందిన రామారావు అనే వ్యక్తికి వెన్నెముక సమస్యతో కాళ్లు చేతులు బలహీనపడి నడవలేని స్థితి వచ్చిందని, ఇతర ఆసుపత్రుల్లో మూడుసార్లు (రెండు సార్లు వెన్నుపూసకు, ఒకసారి మెదడుకు) శస్త్రచికిత్సలు చేయించుకున్నప్పటికీ ఎలాంటి ఉపశమనం లభించకపోగా, ఆరోగ్యం మరింత క్షీణించిందని తెలిపారు. ఆ బాధితునికి అత్యంత క్లిష్టమైన 'సిరంగో సబారాచనాయిడ్ షంట్' ఆపరేషన్‌ని విజయ వంతంగా నిర్వహించామన్నారు. దీంతో ఆ రోగికి పునర్జన్మ లభించినట్లయిందన్నారు. వెన్నెముక లోపల మిల్లీమీటర్ పరిమాణంలో ఉండే చిన్న ట్యూబ్‌ను అమర్చామని, రోగి పూర్తిగా కోలుకుంటున్నాడని వారు తెలిపారు. నెల్లూరు వంటి నగరాల్లో ఇలాంటి అత్యున్నత స్థాయి మైక్రో-న్యూరో సర్జరీలు చాలా అరుదుగా జరుగుతాయన్నారు. ఆసుపత్రిలో ఉన్న అధునాతన సాంకేతిక పరికరాలు, అత్యాధునిక మైక్రోస్కోప్లు మరియు నిపుణులైన డాక్టర్ల సేవలతో మన ప్రాంత ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన వైద్యం ఇప్పుడు స్థానికంగానే అందుబాటులోకి వచ్చిందని వారు తెలిపారు.

# యువత అవగాహనకు..గోడపత్రికలు


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లాలోని యువత, సాధారణ ప్రజల్లో హెచ్ఐవీ, సుఖవ్యాధులు, డ్రగ్ అడిక్షన్‌పై అవగాహన కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో చేపట్టిన రెండు నెలల ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌ను నెల్లూరు కలెక్టరేట్‌లో ఈనెల 10న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.సుజాత, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా. ఎస్.కె.ఖాదర్ వలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్వేయర్లకు ల్యాప్‌టాప్‌లు

నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల 18 మంది సర్వేయర్లకు ల్యాప్ టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రీసర్వే కార్యకలాపాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భూ రికార్డుల డిజిటలైజేషన్, క్షేత్రస్థాయి సర్వే తదితర పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని తెలిపారు.


ల్యాప్‌టాప్‌లని అందజేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

# రేషన్ బియ్యం పట్టివేత

నెల్లూరు సమీపంలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అధికారులు తనిఖీలు చేస్తుండగా, రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తుండడం గమనించారు. ఓ వాహనంలో 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డిఎస్ఓ ఐ.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీతో పాటు పీడీఎస్ బియ్యాన్ని వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఈ ఘటనకు సంబంధించి 6-ఏ నివేదికను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పిస్తామన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, అక్రమ నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం, ఆత్మకూరు సిఎస్‌డీటీలు సైమన్ బాబు, అజేయుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'తిరంగా ర్యాలీ'



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి, దగుమాటి, కాకర్ల, జడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్, జేసీ వెంకటేశ్వర్లు తదితరులు.

ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందుగా నెల్లూరు జిల్లాలో తిరంగా ర్యాలీతో సంబరాలకు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టారు. పలువురు అధికారులు, నాయకులు కలిసి జాతీయ పతాకాలు చేతబట్టి దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈనెల 12వ తేదీన కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో 275 అడుగుల జాతీయ జెండాతో భారీగా నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా దేశభక్తిని పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వై.ఓ.నందన్, అధికారులు, విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొని దేశభక్తి ఉప్పొంగేలా నినాదాలు చేస్తూ విఆర్‌సి వరకు ర్యాలీని నిర్వహించారు. ఆగస్టు15న పరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలపట్ల గౌరవ భావాన్ని పెంపొందించడమే తిరంగా ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి భారతదేశ ఔన్నత్యం, దేశ సౌభాగ్యం కోసం ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

# శ్రీసిటీలో సుస్థిర అభివృద్ధి విధానాలు

- ప్రశంసించిన ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు



శ్రీసిటీ నమూనాను పరిశీలిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు

శ్రీసిటీలోని సమగ్ర ప్రణాళిక, మౌలిక వసతులు, సుస్థిర అభివృద్ధి విధానాలు అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు కొనియాడారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు చెందిన 21 మంది ట్రెయినీ అసిస్టెంట్ కమిషనర్లు తమ అధ్యయనంలో భాగంగా వారు ఈనెల 12, 13వ తేదీలలో అంతర్జాతీయస్థాయి ఖ్యాతిగాంచిన ప్రముఖ పారిశ్రామిక వాడ శ్రీసిటీని సందర్శించారు. పట్టణ మరియు పారిశ్రామిక అభివృద్ధికి అనుసరించదగిన ఒక చక్కని నమూనాగా శ్రీసిటీ ఉందని వారు అభివర్ణించారు. రాష్ట్ర పన్నుల విభాగం (జీఎస్టీ) జాయింట్ కమిషనర్ మురళీకృష్ణ నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ తొలుత సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీకి జాతీయ స్థాయి ప్రమాణాల కేంద్రంగా గుర్తింపు లభించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తమ పారిశ్రామికవాడ అమలు విధానాన్ని అధికారులు, పాలనా నిపుణులు అధ్యయనం చేయడం తాము గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ అభివృద్ధి ప్రస్థానం, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఇతర ప్రత్యేకతలపై శ్రీసిటీ అధికారులు వారికి సమగ్ర అవగాహన కల్పించారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' కార్యక్రమాల్లో శ్రీసిటీ పోషిస్తున్న కీలక పాత్రను వారు వివరించారు. అదేవిధంగా పన్నులు, ఎగుమతి సుంకాలు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా జాతీయ ఖజానాకు శ్రీసిటీ అందిస్తున్న గణనీయమైన సహకారాన్ని తెలియజేశారు. అనంతరం, ట్రైనీ అధికారుల బృందం వరుణ్ బెవరేజెస్ (పెప్సికో), బ్లూస్టార్, బాల్ కార్పొరేషన్ పరిశ్రమలని సందర్శించారు.



శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు

# శ్రీసిటీ రెండవ విడత భూసేకరణ ప్రక్రియ

- భూములిచ్చిన రైతులకు పరిహారం

శ్రీసిటీ విస్తరణ కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రెండవ విడత భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. పారిశ్రామిక ప్రగతికి పలువురు రైతులు సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. రెండవ దశలో సత్యవేడు మండలంలోని 4రెవిన్యూ గ్రామాల పరిధిలో సుమారు 2500 ఎకరాలు సేకరణకు ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు పలు పర్యాయాలు జిల్లా యంత్రాంగం సంబంధిత రైతులతో చర్చించి పరిహారం నిర్ణయించింది. ఇందులో భాగంగా సత్యవేడు మండలం కొల్లడం గ్రామానికి చెందిన శ్రీమతి అర్పుదమ్మకు ఇటీవల రూ.63,72,397 భూ పరిహారం చెక్కును సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు భూసేకరణ అధికారి దేవేంద్రరెడ్డి అందజేశారు. ఇదేవిధంగా భూములిచ్చిన రైతులందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.


శుభాకాంక్షలు



శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచన

అన్యోన్యతకి
ఆత్మీయతకి
ఆదరణకి
ఆదర్శమైన
ఆది దంపతులకి
60వ వివాహ వార్షికోత్సవ
శుభాకాంక్షలు.

లాయర్
ఆగస్టు 14, 2026

# ‘డ్రగ్స్’ మత్తులో.. చిత్తవుతున్న యువత!

‘డ్రగ్స్-డ్రగ్స్-డ్రగ్స్’.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే మాట వినపడుతోంది. సామాన్యుడి దగ్గర నుంచి ప్రధాని వరకూ డ్రగ్స్ రాకాసిపట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు... ‘క్షణికమైన ఆనందాన్నిచ్చేమత్తు పదార్థాలు యువత ఉజ్వల భవితను దెబ్బతీసి, వ్యక్తిగత జీవితాన్ని గాడాంధకారంలోకి నెట్టేస్తున్నాయని. అందుకే, మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ ప్రతినబూనాలి’ అని ఇటీవలే ప్రధాని మోడీ దేశప్రజలకి పిలుపునిచ్చారు. అంతేకాదు, ఈనెల 2వ తేదీ నుంచి 100 వారాల పాటు దేశవ్యాప్తంగా మత్తు-మాదకద్రవ్యాలకి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాలి’..అని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు కూడా. నిజమే, ఇప్పుడు డ్రగ్స్ సమాజానికి మరో పెద్ద విపత్తులా తయారయ్యాయి. ఒకప్పుడు ఎప్పుడో ఎక్కడో ఉన్న ఈ మత్తు పదార్థాలు ఇప్పుడు సమాజమంతా విషవాయువులా వ్యాపిస్తున్నాయి. ఈ మత్తులో పడి తమ బతుకులను చిత్తుచేసుకుంటున్న యువత దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలోనే ఉంటున్నదంటే అతిశయోక్తేమీ కాదు. 2026 నాటికి డ్రగ్స్ వంటి మత్తు-మాదకద్రవ్యాలతో ఆరోగ్యాలు చెడిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నవారు కూడా వందల సంఖ్యలోనే ఉంటున్నారంటే, డ్రగ్స్ ఎంత ప్రాణాంతకమో అర్థం చేసుకోవచ్చు. నానాటికీ ఇది దేశానికి ఒక పెద్ద మహమ్మారిగా తయారవుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనే కాదు, ఆధునికత మోజు పెరిగిపోతున్న పెద్దపెద్ద నగరాల్లో మత్తు పదార్థాలను మరింత విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. పబ్‌లు, క్లబ్‌లు వంటివి అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలై ప్రజల మెదళ్ళను మత్తులో ముంచెత్తుతున్నాయి. బాగా చదువుకుని కుటుంబానికి, దేశానికి ఉపయోగపడాల్సిన విద్యార్థులు చిన్న నాటినుంచే చెడుతిరుగుళ్ళకు అలవాటుపడి, పెద్దల మాట వినకుండా జల్సాలతో కాలం గడిపేస్తున్నారు. చిన్నవయసు నుంచే చాలామంది విద్యార్థులు డ్రగ్స్‌కి అలవాటు పడిపోతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, అనేక విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఎక్కువగా ఈ మత్తుకి బానిసలవుతున్నట్లు నిపుణులు వెల్లడిస్తున్నారు. తెలిసో తెలియకో ఒక్కసారి డ్రగ్స్‌కి అలవాటు పడితే.. జీవితమంతా కష్టాలే. శారీరకంగా, మానసికంగా అనేక రోగాలు చుట్టుముడతాయి. డ్రగ్స్‌తో కలిగే దుష్ప్రభావాలు ఎంతో దారుణంగా ఉంటాయని, జీవితాలను అవి ఎలా సర్వనాశనం చేస్తాయో అర్థం చేసుకోవాలని అటు విద్యాలయాల వారు, పోలీసు తదితర ప్రభుత్వశాఖల వారు నిరంతరం విద్యార్థులకు తెలియజేస్తూనే ఉన్నారు. అలాంటి చైతన్యవంతమైన అవగాహనలు అన్ని ప్రాంతాల్లోనూ ఇంకా ముమ్మరం కావాలి. గంజాయి ఉత్పత్తిదారులు, వాటి అమ్మకందారులు ఏదో ఒక దొడ్డిదారిన ప్రజల్లోకి వాటిని తెచ్చి, వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. చివరికి చిన్నపిల్లల బడుల వద్ద చిల్లరంగళ్ళలో కూడా మత్తుపదార్థాలను రకరకాల రూపాల్లో విక్రయిస్తున్నారంటే ఏమనుకోవాలి?.. చాకెట్ల రూపంలో కూడా మత్తుపదార్థాలను పిల్లలకి అలవాటు చేస్తున్నారని ఇటీవలి కాలంలో చాలాచోట్ల బయటపడింది. అలాంటి దుర్మార్గులు.. సంఘవ్యతిరేకశక్తుల పట్ల ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. మత్తుపదార్థాల ఉత్పత్తి, రవాణాదారులకు కఠినశిక్షలు అమలుచేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తమై నిఘా బృందాలను, ప్రత్యేక పోలీసులను నియమించి డ్రగ్స్ నిరోధానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే డ్రగ్స్ వినియోగం, ఉత్పత్తి-అమ్మకాల వంటి వాటికి సంబంధించి ఎన్నో కేసులు నమోదయ్యాయి. డ్రగ్స్‌ని వినియోగించినా, వాటిని కలిగివున్నా, వాటితో ఏమాత్రం సంబంధం ఉన్నా తీవ్రమైన నేరం. కనుక, వాటికి దూరంగా ఉండడం ఒక్కటే మార్గం. కుటుంబాల్లోని తల్లి తండ్రులు, లేదా పెద్దలు ఈ విషయంపై తప్పనిసరిగా బాధ్యత తీసుకోకుంటే ఆ మహమ్మారి చివరికి ఆయా కుటుంబాలనే కాలరాస్తుందని గమనించుకోవాలి. తమ పిల్లలు ఎప్పుడు, ఎక్కడ ఏంచేస్తున్నారనే విషయం పట్టించుకోకపోతే చాలా ప్రమాదమని గుర్తుంచుకోవాలి. దురలవాట్లు, చెడుస్నేహాలు పిల్లల జీవితాలను బాగా దెబ్బతీస్తాయి. మన పిల్లల పట్ల మనమే బాధ్యతగా లేకుంటే, ఇక ఇతరులు చేయగలిగిందేమీ లేదు. డ్రగ్స్‌కి అలవాటుపడిన పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు లేదా కుటుంబసభ్యులు సులభంగానే గమనించవచ్చు. అలా పెడదారిన పట్టినవారిని బాగుచేసుకునేందుకు తక్షణం ప్రయత్నించాలి. పరిస్థితి చేయిదాటి పోయాక ఎవరూ చేయగలిగిందేమీ ఉండదని తెలుసుకోవాలి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ వంటి మత్తురాకాసులకు బలికాకుండా, పిల్లలను ఎప్పుడూ ఒక కంట కనిపెట్టి ఉండాల్సిన కర్తవ్యం తల్లితండ్రులు, వారికి చదువు చెప్పే ఉపాధ్యాయులదేనని అర్థంచేసుకోవాలి. రాకాసిలాంటి డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని చిన్నతనం నుంచే అందరికీ అవగాహనలోకి రావాలి. లేకుంటే జీవితాలు నాశనం.. తస్మాత్ జాగ్రత్త!

# న్యాయ వ్యవస్థ పెద్దలు ఆత్మపరిశీలన చేసుకోవాలి!

హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ స్నాతకోత్సవానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ప్రధాన అతిథిగా ఆహ్వానించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడం సంచలన పరిణామం. నేటి యువతపై ఆయన చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని, ఆయన చేతులమీదుగా న్యాయశాస్త్ర పట్టా అందుకోవడం తమకు ఇష్టం లేదని విద్యార్థులు నిరసన వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇది ఒక వ్యక్తిని విమర్శించే అంశంగా మాత్రమే చూడకూడదు. న్యాయశాస్త్రాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులే దేశ అత్యున్నత న్యాయస్థానం అధిపతి వ్యవహార శైలిపై ప్రశ్నలు లేవనెత్తడం న్యాయవ్యవస్థ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. న్యాయమూర్తుల మాటలకు, ముఖ్యంగా ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అవి ప్రజల్లో ఎలాంటి భావన కలిగిస్తున్నాయన్న విషయంలో మరింత సంయమనం అవసరం. జస్టిస్ సూర్యకాంత్ తరువాత తన వ్యాఖ్యలు భారత యువత మొత్తాన్ని ఉద్దేశించినవి కావని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే విద్యార్థుల్లో ఏర్పడిన అభిప్రాయం ఈ ఘటన ద్వారా బయటపడింది. న్యాయ విద్యార్థులు ప్రశ్నించడం, అసమ్మతి వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు కాదు. రాజ్యాంగం, పౌర హక్కులు, భావప్రకటన స్వేచ్ఛలను బోధించే విద్యాసంస్థల్లో ప్రశ్నించే హక్కుకు గౌరవం ఉండాలి. ఈ ఘటనను న్యాయవ్యవస్థకు అవమానంగా చూడటం కంటే, న్యాయవ్యవస్థపై యువత పెట్టుకున్న అంచనాలకు ప్రతిబింబంగా చూడాలి. అత్యున్నత న్యాయస్థానం ప్రజల విశ్వాసంతోనే బలపడుతుంది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత న్యాయమూర్తుల మాటల్లోనూ, చేతల్లోనూ ఉంటుంది. న్యాయవ్యవస్థను ప్రశ్నించే విద్యార్థి వల్ల అది బలహీనపడదు. ప్రశ్నలకు సమాధానం చెప్పే న్యాయవ్యవస్థ మరింత బలపడుతుంది. ఏది ఏమైనా అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతీయ న్యాయవ్యవస్థకి ఇలాంటి పరిస్థితి మరోసారి రాకూడదు. అలా రాకుండా చూసుకోవలసిన బాధ్యత గౌరవ న్యాయ వ్యవస్థ పెద్దలదే అని నా అభిప్రాయం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

# వెంకయ్య చొరవ అభినందనీయం!

“విజయవాడ – బెంగళూరు వందే భారత్ రైలు ప్రారంభించే విషయంలో భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి.. మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవ చూపాలి” అంటూ లాయర్ పత్రిక ప్రజావాణి ద్వారా నేను చేసిన విన్నపాన్ని మన్నించి సహృదయంతో స్పందించినందుకు వెంకయ్యనాయుడు గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. నా విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినివైష్ణవ్‌తో వెంకయ్య గారు స్వయంగా ఫోన్‌చేసి మాట్లాడడమే కాకుండా ఒక లేఖ కూడా రాయడం ప్రజా అవసరాలు తీర్చడం పట్ల వెంకయ్యనాయుడు గారికి వున్న చిత్తశుద్ధికి అద్దం పడుతుంది. ఈ రైలు సాధ్యమైనంత త్వరగా ప్రారంభమైతే ఆ ఘనత మొత్తం వెంకయ్యనాయుడి గారికే దక్కుతుంది, వారికి నా అభివందనాలు..!

– బి. హేమంత్‌కుమార్‌రెడ్డి, బెంగళూరు.

# ప్రక్షాళనకి.. ఇదే సరైన సమయం

మనసులో మాట 110

ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి జార్ఖండ్ వీధుల వరకు ఇటీవల యువతరం చేపట్టిన ఆందోళనలు దేశంలో నెలకొన్న తీవ్రమైన ఉద్యోగ, పరీక్షల సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. ఈ నిరసనలకు ప్రధాన కారణం – ప్రశ్నపత్రాల లీకేజీలు. నిరుద్యోగ యువత ఆందోళనను కొన్ని రాజకీయ శక్తులు స్వార్థప్రయోజనాలకు ఉపయోగించుకోవటం నిజమే అయినప్పటికీ, యువత ఆక్రోశాన్ని ఏమాత్రం తక్కువ చేసి చూడలేము. రాజకీయాలను కాసేపు పక్కన పెడితే, ప్రశ్నపత్రాల లీకేజ్ అనేది మన విద్యా, నియామక వ్యవస్థల లోని డొల్లతనాన్ని, అవినీతి మకిలిని బయటపెడుతోంది.

కొన్ని వందలు లేదా వేల ఉద్యోగాలు, డాక్టర్ సీట్ల కోసం లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు రేయింబవళ్లు, సంవత్సరాల తరబడి కష్టపడి చదువుతున్నారు. నిద్రాహారాలు మానేసి, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కోచింగ్ సెంటర్లకు ధారపోసి, తమ జీవితాన్ని పోటీ పరీక్షలకే అంకితం చేస్తున్నారు. అయితే, పరీక్షా సమయానికి ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, రూటర్లు, మాఫియా చేతుల్లోకి వెళ్లడం వల్ల కొందరు అర్హత లేనివారు లబ్ధి పొందుతున్నారు. ఏళ్ల తరబడి శ్రమించిన నిజమైన ప్రతిభావంతుల కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతోంది. ఇది కేవలం ఒక విద్యార్థికి జరిగే అన్యాయం మాత్రమే కాదు, సమాజంలో న్యాయం, ప్రతిభపై ఉండే నమ్మకాన్ని వమ్ము చేసే చర్య.

ఇక్కడ మనం మరో చేదు నిజం గురించి కూడా చర్చించుకోవాలి. దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు యువత ఓట్ల కోసం భ్రమలతో కూడిన హామీలు గుప్పిస్తున్నాయి. “మేము అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తాం” అని వేదికలపై ప్రకటించడం ఆనవాయితీగా మారింది. కానీ అవి ప్రభుత్వ ఉద్యోగాలా లేక ప్రైవేటు ఉద్యోగాలా? అన్న స్పష్టతను ఇవ్వటం లేదు. లక్షల మంది యువతరం అవి ప్రభుత్వ ఉద్యోగాలు అనుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉండేవి కొన్ని వేలు మాత్రమేనన్న స్పష్టతను పార్టీలు ఎప్పుడూ ఇవ్వడం లేదు. లక్షలాది మంది నిరుద్యోగులకు కొన్ని వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా సరిపోతాయి? మరోవైపు, యువత కూడా ఏ ప్రభుత్వ ఉద్యోగమో వస్తేనే జీవితం స్థిరపడుతుందనే భ్రమలో ఏళ్లకు ఏళ్లు కాలాన్ని వృథా చేస్తోంది.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యువతలో ఏర్పడే తీవ్ర నైరాశ్యం సామాజిక అశాంతికి దారితీస్తుంది. దీనిపై సమాజంలో విస్తృత చర్చ జరగకపోతే, యథార్థాన్ని యువతకు వివరించి అవగాహన కల్పించకపోతే మనం దేశ భవిష్యత్తుకు తీరని అన్యాయం చేసిన వారమవుతాం. ఈ సమస్యకు స్థానిక స్థాయిలో, జాతీయ స్థాయిలో తక్షణ పరిష్కారం చూపకపోతే, నిరుద్యోగ యువతలోని అసంతృప్తి దావాగ్నిలా మారే ప్రమాదం ఉంది. దీనికి రాజకీయ ప్రేరేపణలు తోడైతే శాంతిభద్రతలు కట్టుదప్పడం ఖాయం. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం వల్ల ఏ ఉపయోగమూ ఉండదు. సమయం మించిపోకముందే బాధ్యతాయుతమైన చర్యలు చేపట్టడం అవసరం.

రాజనీతిజ్ఞులు, మేధావులు, విద్యావేత్తలు వెంటనే ఈ అంశంపై విస్తృత ఏకాభిప్రాయానికి రావాలి. కేవలం ప్రభుత్వ నియామకాలపైనే ఆధారపడకుండా, ప్రతిభకు తగిన అవకాశాలు సృష్టించాలి. ప్రైవేటు రంగంలో ఉన్న అవకాశాలను, స్వయం ఉపాధికి ఉన్న సువర్ణ అవకాశాలను వివరిస్తూ యువతలో స్పష్టమైన అవగాహన కల్పించాలి. ఉపాధి ఆధారిత విద్యను ప్రోత్సహించడం ద్వారా యువత స్వశక్తిపై నిలబడేలా చేయవచ్చు.

వికసిత్ భారత్ రూపుదిద్దుకోవాలంటే మనకున్న అతిపెద్ద బలం ‘యువశక్తి’. ఆ యువతరం కష్టపడి పనిచేయాల్సిన వయసులో, ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటే, ఆ అపరిమితమైన శక్తి దారి తప్పే ప్రమాదం ఉంది. సృజనాత్మకమైన ఆలోచనలతో దేశాన్ని ముందుకు నడిపించాల్సిన అడుగులు నిరసనల వైపు మళ్లే పరిస్థితి రాకూడదు.

పార్టీలు, ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరవాలి. మన అంతర్గత సమస్యలను, నిరుద్యోగ సంక్షోభాన్ని సమర్థవంతంగా పరిష్కరించుకోకపోతే, అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతున్న భారత్‌పై కుట్రలు చేసే బాహ్య శక్తులకు సులభంగా అవకాశం ఇచ్చినట్లవుతుంది. ఆ దుష్టశక్తుల దిష్టి కళ్ళు మన మీద పడకముందే, దేశ శాంతిభద్రతలకు, అభివృద్ధికి విఘాతం కలగకముందే నాయకులు, ప్రభుత్వాలు తక్షణ జాగ్రత్తలు తీసుకోక తప్పదు. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, లీకేజీలకు పాల్పడే వారిపై అత్యంత కఠినమైన చర్యలు, స్పష్టమైన నియామకాల క్యాలెండర్ ద్వారా మాత్రమే యువతలో తిరిగి నమ్మకాన్ని నింపగలం. ఉద్యోగ నియామక ప్రక్రియల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడమే కాకుండా, కాలంచెల్లిన విద్యా విధానాన్ని ఆధునీకరించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. గ్లోబల్ మార్కెట్‌లో రాణించేలా ప్రాక్టికల్ స్కిల్స్ నేర్పించడంపై విద్యాసంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలి. యువతకు తమ సామర్థ్యంపై నమ్మకం పెంచి, ఉద్యోగాలు వెతుక్కునే వారిగా కాక వారిని ఉపాధి కల్పించే వ్యవస్థలుగా తీర్చిదిద్దినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నాణ్యమైన మానవ వనరుగా మారిన మన యువశక్తితోనే భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా నిలవగలదు.



సంక్షోభం తీవ్రరూపం దాల్చకముందే చట్టసభలు, సమాజం కలిసికట్టుగా నిర్ణయాత్మకమైన అడుగులు వేయాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది.

– తుమ్మల బాల గంగాధర్ తిలక్

## దేవాదాయ శాఖ ఇఓపై..
# మంత్రి ఆనంకి ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు దేవాదాయశాఖ ఇఓ రవికృష్ణ అవినీతికి పాల్పడుతున్నాడంటూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఇటీవల ఫిర్యాదు అందింది. కోట్ల రూపాయలు అవినీతిలో ఇఓదే కీలక పాత్ర అని, దేవాలయాలకి వచ్చే ఆదాయం వ్యక్తిగత ఖాతాలకు మళ్ళింపు జరిగిందని, అదేమని ప్రశ్నిస్తే ఎస్సీఎస్టీ కేసు పెడతానంటూ ఇఓ బెదిరిస్తున్నారని, ఇటీవల మంత్రి ఆనంను కలిసిన గూడూరులోని పలు దేవా లయాల కమిటీ ఛైర్మెన్లు, కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు నేరుగా ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ ఆస్తులు అమ్మేయడం, అక్రమ లీజులు ద్వారా భారీ అవినీతికి పాల్పడడం వంటివి జరిగాయని వారు ఫిర్యాదు చేశారు. స్టేట్ ఎగ్జి క్యూటివ్ మెంబర్ పనబాక కోటేశ్వరరావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆరికట్ల బాలకృష్ణనాయుడు, కలవ కొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఛైర్మెన్ కందల అర్చన మరియు పలు దేవాలయాల కమిటీ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. అందుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఈవోపై సత్వరమే విచారణ జరిపి చర్యలు తీసుకో వాల్సిందిగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని ఆదేశించారు.

# వైసీపీ దిగజారుడు రాజకీయాలు
## మంత్రి నారాయణ

మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మంది యువతకు ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిందని, ప్రస్తుతం వారంతా సంతోషంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారని, దీంతో ప్రభుత్వ విజయాన్ని చూసి వైసీపీ ఓర్వలేక డీఎస్సీపై లేనిపోని నిందలు వేస్తోందని మంత్రి నారాయణ మండిపడ్డారు. ఇటీవల మంత్రి ఈ విషయమై విలేకర్లతో మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో మరోసారి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనున్నారని, తద్వారా మరిన్ని ఉద్యోగాలు భర్తీ అవుతాయనే భయంతోనే వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు



ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయక సంస్థ ద్వారా, శారీరక వైకల్యం కలిగిన అర్హులైన 8 మంది దివ్యాంగులకు ఇటీవల 9.60లక్షల రూపాయల విలువ గల రెట్రో ఫిట్టింగ్ చేయబడిన మూడు చక్రాల మోటార్ వాహనాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిటీ@18

## 31 దేశాలకి చెందిన.. 260కి పైగా పరిశ్రమలతో..
# పారిశ్రామిక ప్రగతికి దిక్సూచిగా.. శ్రీసిటీ

***దక్షిణ భారతదేశంలో పారిశ్రామిక విప్లవానికి శ్రీసిటీ నాంది పలికి ఇప్పటికి 18 ఏళ్ళు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అంతర్జాతీయ పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ ఎదిగి ఇప్పటికి 18 సంవత్సరాలు. రాష్ట్రానికి తలమానికంగా, దేశ పారిశ్రామిక ప్రగతికి దిక్సూచిగా శ్రీసిటీ తన ప్రస్థానం సాగించి ఆగస్టు 8వ తేదీతో 18 వసంతాలు. అంతర్జాతీయస్థాయి గుర్తింపు తెచ్చు కున్న శ్రీసిటీ..కేవలం మన రాష్ట్రానికే కాదు..దేశానికే గర్వకారణం. 08.08.2008న శ్రీసిటీ ప్రారంభం కావడం, '2026' ఆగస్టు 8నాటికి 18 ఏళ్ళు పూర్తి చేసుకోవడం విశేషం! అనేక దేశాలకి చెందిన వందలాది పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయంటే..ఇక్కడ పారిశ్రామిక ప్రగతికి ఢోకా లేదనే నమ్మకం ప్రపంచస్థాయి పారిశ్రామిక వేత్తలకు కూడా కలగడమే అందుకు ప్రధాన కారణం. శ్రీసిటీ యాజమాన్యం పట్టుదలకి, దీక్షాదక్షతలకి, ప్రతిభా పాటవాలకి ఇదొక ప్రతీక అని చెప్పవచ్చు.***

ఒకప్పుడు బాగా వెనుకబడిన ప్రాంతంగా, అసలు పరిశ్రమలు అన్న మాటే తెలియని దశలో ఉన్న నాటి నెల్లూరు..నేటి తిరుపతి జిల్లాలో ఉన్న తడ ప్రాంతం ఇప్పుడు పారిశ్రామిక రంగంలో మెరుపులు మెరిపిస్తోంది. దాదాపు 8 వేలకు పైగా ఎకరాల్లో విస్తరించిన శ్రీసిటీలో, 31 దేశాలకు చెందిన 260కిపైగా దేశ విదేశీ సంస్థలు, పెద్దపెద్ద కంపెనీలతో ఆ ప్రాంతమంతా ఒక పెద్ద పారిశ్రామిక హబ్‌గా వెలసి వర్ధిల్లుతోంది. దేశానికే తలమానికంగా నిలిచిన ఎన్నో పరిశ్రమల ద్వారా రూ.53 వేల కోట్లకు పైగా పెట్టుబడులు, రూ.57,500 కోట్లకు పైగా ఎగుమతులుతో శ్రీసిటీ పరిశ్రమలకి నెలవుగా మారింది. ప్రత్యేకించి ఎయిర్ కండిషనర్లు, ఆటోమొబైల్స్, మెట్రో కోచ్‌లు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, ఆహార ప్రాసెసింగ్, వినియోగ వస్తువుల తయారీలో శ్రీసిటీ దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా నిలిచింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డైకిన్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఇసుజు, ఆల్స్టమ్, మోండెలీజ్, కోల్‌గేట్, కెలాగ్స్, కింబర్లీ-క్లార్క్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడి నుంచి దేశీయ, విదేశీ మార్కెట్లకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తుండడం గొప్ప విషయం. సముద్ర తీర పోర్టులు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఎస్ఈజెడ్, ఎఫ్‌టిడబ్ల్యూజెడ్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ వంటి మౌలిక సదుపాయాలు శ్రీసిటీ అభివృద్ధికి బలంగా నిలవడం. శ్రీసిటీ యాజమాన్యం స్ఫూర్తిదాయకంగా వనరులు సమీకరించి, పరిశ్రమలకు ఎలాంటి కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తుండడంతో ఎన్నో పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. ఇంకా వస్తున్నాయి కూడా. ఇప్పుడున్న పరిశ్రమల్లో సుమారు 75 వేల మందికిపైగా ఉపాధి లభించడం, అందులో సగం మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వడంతో వేలాదిమంది నిరుద్యోగుల జీవితాలకు శ్రీసిటీ వెలుగుబాటలు పరచినట్లయింది.

### 'కూల్ క్యాపిటల్'గా మరింత పటిష్టం :

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, సోలమ్ వంటి సంస్థల కొత్త పెట్టుబడులు, విస్తరణలతో శ్రీసిటీ దేశంలోనే 'కూల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఇప్పటికే డైకిన్, బ్లూ స్టార్, క్యారియర్, హావెల్స్ లాయిడ్, అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్ సహా 10 ప్రధాన ఏసీ తయారీ సంస్థలు, 30కి పైగా విడిభాగాల తయారీ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2027 నాటికి దేశంలో తయారయ్యే ఎయిర్ కండిషనర్లలో దాదాపు 60 శాతం శ్రీసిటీ నుంచే ఉత్పత్తి అవుతాయని కూడా పారిశ్రామికవర్గాలు అంచనా వేస్తున్నాయి.

### విద్యా హబ్‌గా కొత్త అడుగులు :

ఒక్క పరిశ్రమలకే కాదు, విద్యాకేంద్రంగా కూడా శ్రీసిటీ తన ప్రతిష్టని మరింతగా ఇనుమడింజేసుకుంటోంది. క్రియా, ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలు, ఐఎఫ్ఎంఆర్ బిజినెస్ స్కూల్, చిన్మయ, అకార్డ్ సిబిఎస్ఈ స్కూల్స్ ఏర్పాటుతో విద్యా కేంద్రంగా కూడా విరాజిల్లుతున్న శ్రీసిటీలో 'వర్క్-స్టడీ' డ్యూయల్ మోడల్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇస్తోంది. సరికొత్తగా పరిశ్రమలతో విద్యను అనుసంధానిస్తూ శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని కూడా ఈ ఏడాది ప్రారంభించడం శ్రీసిటీ అభివృద్ధిలో మరో మైలురాయి అని చెప్పవచ్చు. తద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులు భవిష్యత్ ఉద్యోగావకాశాలకు బాటలు వేయనుంది.

### పెట్టుబడులకి గమ్యస్థానం..



**డా. రవీంద్ర సన్నారెడ్డి**
**వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్**

ఈ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే దూరదృష్టితో 18 ఏళ్ళ క్రితం శ్రీసిటీకి శ్రీకారం చుట్టాం. నేడు ఇది ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన తయారీ కేంద్రంగా ఎదిగి, భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. పెట్టుబడిదారులు మాపై ఉంచిన విశ్వాసం, మా ఉద్యోగుల అంకితభావం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం దీనికి తోడ్పాటు అందించాయి. మున్ముందు కూడా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనకు కట్టుబడి, ప్రపంచ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో శ్రీసిటీ తన వంతు పాత్రను మరింత బలోపేతం చేస్తుంది. అలాగే పారిశ్రామిక వృద్ధితో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి చేయడం మా ప్రాధాన్యత. నిరంతర సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా దీనిని ముందుకు తీసుకువెళతాం.



శ్రీసిటీ ఏరియల్ వ్యూ

### సామాజిక సేవా కార్యక్రమాలకు పెద్దపీట :

పారిశ్రామిక ప్రగతి, విద్యాభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి శ్రీసిటీ నిరంతరం కృషి చేస్తోంది. 2009లో ప్రారంభమైన 'శ్రీసిటీ ఫౌండేషన్' ద్వారా 40కిపైగా పారిశ్రామిక భాగస్వాముల సహకారంతో ఇప్పటివరకు రూ.61 కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యం, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో వినియోగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాల కల్పన, వృత్తి నైపుణ్య శిక్షణ, కమ్యూనిటీ లైబ్రరీల ఏర్పాటు, పచ్చదనం, జలవనరుల పునరుద్ధరణ వంటి అనేక కార్యక్రమాలను ఫౌండేషన్ చేపట్టింది. ఇప్పటివరకు 5వేల మందికిపైగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించింది. ఈ కార్యక్రమాల ద్వారా జీవనోపాధి అవకాశాలు మెరుగు పడటంతో పాటు మహిళా సాధికారత, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, సామాజిక అంశాల్లోనూ సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

### విస్తరణతో లక్ష్యం దిశగా అడుగులు :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీసిటీ విస్తరణకు అదనంగా 2వేల ఎకరాలను కేటాయించడంతో, ప్రపంచస్థాయి పోటీతత్వాన్ని, సామాజిక సమ్మిళిత అభివృద్ధిని, పర్యావరణ బాధ్యతను సమన్వయం చేస్తూ భారతదేశంలో తదుపరి దశ తయారీ రంగ ఆధారిత వృద్ధికి శ్రీసిటీ ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తోంది. నేడు గ్లోబల్ పారిశ్రామిక శక్తికేంద్రంగా ఎదిగిన శ్రీసిటీ, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి అనుగుణంగా, అడుగులు వేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ పారిశ్రామిక భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించే దిశగా శ్రీసిటీ పయనిస్తోంది.

## వార్షికోత్సవం రోజున రక్తదాన శిబిరం




రక్తదాతలని అభినందిస్తూ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా శ్రీసిటీ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు 325 మంది రక్తదానం చేయడం హర్షదాయకం. యాక్సెలెంట్ ఫార్మా, టీఐఎల్ హెల్త్‌కేర్, ఎన్‌జీసీ, టీఎచ్‌కే, రాక్‌వర్త్, బ్రేక్స్ ఇండియా తదితర పరిశ్రమల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు ఎంతో ముఖ్యమైన రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన దాతలను అభినందిస్తూ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు.

## నిరసన దీక్షలు కాదు..
# ప్రాయశ్చిత్త దీక్షలు చేయాలి

➤ వైసీపీ నేతలకి ఎమ్మెల్యే కోటంరెడ్డి చురక



వైసీపీ చేయాల్సింది నిరసన దీక్షలు కాదు, ప్రాయశ్చిత్త దీక్షలు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీ నేతలకు చురకంటించారు. ఇటీవల ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గత ఐదేళ్లలో జగన్ రాష్ట్రాన్ని నాశనం చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, రాజధానితో మూడు ముక్కలు ఆట ఆడిన చరిత్ర వైసీపీదని మండిపడ్డారు. వైసీపీ ఇవ్వలేని ఉపాధ్యాయ ఉద్యోగాలను లోకేష్ ఇచ్చారని అన్నారు. టీచర్ ఉద్యోగాలను అడ్డుకోవాలని వైసీపీ వాళ్ళు వందలాది కేసులు వేశారని, వీళ్ళకి హైకోర్టు మొట్టికాయలు వేసినా వారిలో మార్పు రాక పోవడం విచారకరమని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక 26 నెలల్లో రూరల్‌లో 857కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. కొన్ని జరుగుతున్నాయి. కొన్ని టెండర్లు పిలవబోతున్నారని తెలిపారు.

## 'కిషోర్స్ రత్నం' విద్యార్థులకు వినూత్న అభ్యసన




న్యూస్‌పేపర్‌లతో హుషారుగా 'కిషోర్స్ రత్నం' చిన్నారులు

చిన్నారుల్లో ప్రాథమిక స్థాయి నుంచి సృజనాత్మకత, ఆసక్తి, పరిశీలనా సక్తి, నైపుణ్యం పెంపొందించే లక్ష్యంతో 'కాలిడన్ కిడ్స్' ఆధ్వర్యంలో ఇటీవల సరికొత్త అభ్యసనం ప్రారంభించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు స్థానిక ఐఎంఏ హాల్‌లో దానిని ఆవిష్కరించారు. పీపీ1, పీపీ2 విద్యార్థుల విద్యాస్థాయికి అనుగుణంగా యాక్టివిటీ ఆధారిత న్యూస్‌పేపరని విద్యావిధానంలో భాగంగా రూపొందించారు. ఇందులో పజిల్స్, మేజ్, సుడోకు, సరదా విషయాలు, జ్ఞానసమాచారం, సులభమైన ప్రయోగాలు వగైరాలు ఉంటాయి. విద్యార్థులకు ఇలాంటివి బాగా ఉప యోగపడతాయని, డా. కిషోర్స్ రత్నం స్కూల్‌లో ప్రతిఏటా ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని సుధీర్‌బాబు కాలిడన్ కిడ్స్ డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతిలను ప్రశంసించారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ ఖాసీం, ప్రిన్సిపల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'గమ్..మత్తు' షార్ట్‌ఫిల్మ్.. షూటింగ్ ప్రారంభం



నటీనటులకి సన్నివేశాన్ని వివరిస్తున్న కళాంజలి అనంత్

మత్తు–మాదకద్రవ్యాలకి వ్యతిరేకంగా నెల్లూరులోని ప్రముఖ దర్శకుడు–రచయిత కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో, 'కళాంజలి సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు ఆధ్వర్యంలో ఈనెల 9న 'గమ్..మత్తు' షార్ట్‌ఫిల్మ్ ప్రారంభమైంది. గంజాయి, డ్రగ్స్ వంటివి సమాజాన్ని, ముఖ్యంగా విద్యార్థులు..యువతని నాశనం చేస్తున్నాయని, అందరూ వాటికి దూరంగా ఉండాలంటూ సందేశాత్మకంగా ఈ షార్ట్‌ఫిల్మ్ రూపొందిస్తున్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు సమీపంలోని ఇందుకూరుపేట మండలం పేడూరు గ్రామంలో ఉన్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో తొలి షూటింగ్ ప్రారంభించారు. ఇందులో నటిస్తున్న నటీనటులు శిరీష, బెనర్జీ, మంజుల తదితరులపై దర్శకుడు అనంత్ కొన్ని ఆసక్తికర సన్నివేశాలను చిత్రీకరించారు. కెమెరా ఏ.రాజేష్ ఆధ్వర్యంలో చిత్రీకరణ జరిగింది. షూటింగ్ కార్యక్రమానికి ఆలయ అర్చకులు నర్సింహకుమారస్వామి, సంధ్యమ్మ, గుర్రం పరంధాములు, హరీష్ తదితరులు సహకరించారని అనంత్ తెలిపారు.

## టీడీపీ నాయకురాలి దీక్ష

గోవిందనామాలను కించ పరచకండి, హిందూ ధర్మాన్ని కాపాడండి అంటూ తెలుగుదేశం మహిళావిభాగం నగర అధ్యక్షు రాలు కప్పిర రేవతి ఈనెల 11న నగరంలోని సంతపేట ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద దీక్ష చేప ట్టారు. ఉదయం 9 నుంచి బుధ వారం 9 గంటల వరకు 24 గంటలపాటు దీక్ష చేశారు. గోవిందనామాలను రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం విచారకర మని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

## బరితెగిస్తున్న గొలుసుదొంగలు

నెల్లూరు పరిసరాల్లో గొలుసు దొంగలు విజృంభిస్తున్నారు. అంబాపురం వాటర్‌ట్యాంకు సమీ పంలో ఈనెల 11న ఒక మహిళ ఇంటివద్ద ఆవులను కట్టేస్తుండగా, గుర్తుతెలియని దుండగులు ఇద్దరు వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారుదండను తెంపుకు పోయారు. బాధితురాలు లబో దిబోమంటూ పోలీసులను ఆశ్ర యించారు. వేదాయపాళెం ఇన్స్ పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగుభాషను బాగా నేర్చుకోవాలి

తెలుగుభాషను బాగా నేర్చు కుని, భాషపై పట్టు సాధించాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యురాలు దేవారెడ్డి విజయలక్ష్మి చెప్పారు. ఈనెల 11న నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరి గిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలుగు నేర్చుకుంటే ఇతర శాస్త్రాలను కూడా చక్కగా అధ్యయనం చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, తెలుగు శాఖ అధ్యక్షురాలు జి.పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్ల నిరసన

రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనలో భాగంగా, నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు నిరసన దీక్షలు చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరులోని జూనియర్ డాక్టర్లు ఈనెల 11వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వకు విధులు బహిష్కరించి నిరసన తెలి పారు. రెండేళ్ళకోసారి స్టైఫండ్‌ను పెంచాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ డాక్టర్ల సంఘం పిలుపు మేరకు స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద వైద్యులు ఆమేరకు ఆందోళన చేశారు. అసోసియేషన్ నాయకులు హనీఫ్, భార్గవ్, నిర్మల్, వేణు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# కాలినడకన..3 కిలోమీటర్లు

## సర్వేపల్లి కాలువకట్టపై ప్రజలతో మంత్రి నారాయణ



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారాయణ సంకల్పిం చారు. దాదాపు 60 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న కుటుంబాల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు సుమారు రెండు గంటల పాటు..మూడు కిలోమీటర్ల దూరం నడిచి కాలువకట్టపై ఉన్న ప్రజలు సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో కలిసి ఆయన అక్కడున్నవారి కష్టాలను విన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడి ప్రజలు శాశ్వత పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా కేవలం పొజిషన్ సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని, భగత్‌సింగ్ కాలనీలో ఇచ్చిన తరహాలో శాశ్వత పట్టాలే కావాలని వారు కోరుతున్నారని తెలిపారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించానని మంత్రి చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత పట్టాలు మంజూరు చేయిస్తామన్నారు. మంత్రి నారాయణ హామీతో త్వరలోనే తమ కష్టాలన్నీ తీరిపోతాయని స్థానికులు భావిస్తున్నారు.

# ఆదివాసి దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుజాత, పక్కన సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈనెల 9న నెల్లూరు బీవీనగర్‌లోని గిరిజన భవన్‌లో వేడుకలు జరిగాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో నగర మేయర్ దేవరకొండ సుజాత, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి, ఐటీడీఏ పీఓ సుజాత, గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తాను కూడా గిరిజన మహిళనేనని, గిరిజనుల సమస్యలను తాను అర్థం చేసుకోగలనని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులు, అవకాశాల వల్లే తాను గిరిజన మహిళగా నగర మేయర్‌గా ఉన్నానన్నారు. గిరిజనులు ఆధార్ కార్డు తదితర సమస్యల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమాజంలో చిట్టచివరి స్థానంలో ఉన్న గిరిజనులకు చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు.

## డీసీసీ అధ్యక్షునిగా..
# రెండోసారి కిరణ్‌కుమార్‌రెడ్డి



నెల్లూరుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా రెండోసారి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నియ మితులయ్యారు. ఈనెల 11న కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాల షర్మిల 26 మందితో ఆమేరకు జాబి తాను విడుదల చేశారు. 9మంది ఉపాధ్యక్షులను ప్రకటించగా, వారిలో సీనియర్ నాయకుడు తలారి బాలసుధాకర్‌కి స్థానం కల్పించారు. ప్రధాన కార్యదర్శులుగా న్యాయవాది వి.సుధీర్, కె.సంజయ్, కోశాధికారి సి.ధనుంజయలతో పాటు మరో 13 మంది కార్యదర్శులను నియమించారు.

## మాదకద్రవ్యాలతో జాగ్రత్త!

జీవితాలను నాశనం చేసే మత్తు–మాదకద్రవ్యాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వాటిని నిరోధించేందుకు అందరూ కృషి చేయాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారులు ఈనెల 11న నెల్లూరు లోని కర్నాలమిట్ట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. 'మత్తు–మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణా మాలు–వాటి నిర్మూలనకు విద్యా ర్థులుగా మనవంతు బాధ్యత' అనే అంశంపై పోటీ పెట్టి విజేతలైన విద్యార్థులకు బహుమతులిచ్చారు. ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్.ప్రభాకర్‌రావు, డి.శ్రీధర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు మహిళల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించా లని కోరుతూ ఈనెల 11న ఐద్వా ఆధ్వర్యంలో పొదుపు మహిళలు ఆందోళన చేశారు. తొలుత నగర వీధుల్లో ప్లకార్డులు చేతపట్టి నిరసన ప్రదర్శన నిర్వహించారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్ వచ్చి, వారి సమ స్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఐద్వా జిల్లా కార్య దర్శి షేక్ మస్తాన్‌బీ, నగర కార్య దర్శి కత్తి పద్మ, రూరల్ కార్యదర్శి షాహినాబేగం, నాయకురాళ్ళు రెహానాబేగం, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాంజీనగర్‌లో కార్డన్ సెర్చ్

నేరనియంత్రణ, శాంతిభద్ర తల పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీసులు ఈనెల 12న నెల్లూరు లోని రాంజీనగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇల్లిల్లూ తనిఖీచేసి, ఇళ్ళలో ఎవరు ఉంటున్నారు, ఏం చేస్తున్నారని ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 12 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నగర్ పోలీసు ఇన్స్‌పెక్టర్ కె.సాంబ శివరావు, పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## అమరావతి చాంపియన్‌షిప్

అమరావతి చాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 6వందల మంది క్రీడా కారులు పాల్గొన్నారు. అండర్ 17, 23 విభాగాలలో కబడ్డీ, బాస్కెట్ బాల్, యోగా, బాడ్మింటన్ పోటీలు జరిగాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పాండురంగారావు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# వేగవంతంగా.. దగదర్తి విమానాశ్రయం

## మంత్రి ఆనం వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కురుగొండ్ల, ఇంటూరి, దగుమాటి, కోటంరెడ్డి, కాకర్ల, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి

నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రాబోయే తదుపరి దశ విమానాశ్రయ ప్రాజెక్టుల్లో కుప్పం తర్వాత దగదర్తి ఎయిర్‌పోర్ట్‌కే ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. నెల్లూరు నగరంలోని సంతపేట లోని తన క్యాంపు కార్యాలయంలో ఈనెల 9న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యేలతో కలసి మంత్రి మాట్లాడుతూ, దగదర్తి ఎయిర్‌పోర్ట్ పనులను వెంటనే వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన అదనపు భూముల సేకరణకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌కు పూర్తి అనుమతులు మంజూరు చేసిందని, భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే నెల్లూరు జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరాజు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటి దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు, వాటి వినియోగం, పంటల రక్షణ అంశాలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇటీవల నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి దుర్వినియోగాన్ని సహించేది లేదని, అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క నీటిబొట్టు కూడా వృధా కాకూడదన్నారు. కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి సూచనల మేరకు కావలి కాలువ అభివృద్ధి, విస్తరణ పనులను ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే నార్త్ ఫీడర్ కెనాల్ పరిధిలోని జికేఎన్ పనులను పూర్తి చేసి ఈ సీజన్‌లోనే పంటలకు నీటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమశిల, కండలేరు, ఇరిగేషన్ ఎస్‌ఈలు జి.రామచంద్రమూర్తి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, దేశ్‌నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

## • మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



మత్స్యకార నేతలతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మత్స్యకారుల సంక్షేమం-అభివృద్ధికి ప్రభుత్వం తగు ప్రాధాన్యత ఇస్తోందని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులో మత్స్యకార సంక్షేమసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, సముద్రంలో వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా రూ. 20 వేలు 'మత్స్యకార సేవలో' పేరుతో అందిస్తోందని, ప్రమాద బీమాగా రూ. 5 లక్షల పథకం అమలు చేస్తోందని తెలిపారు. రూ. 1.20 కోట్ల విలువైన డీప్ సీ బోట్లను 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం మత్స్యకారులకు అందజేస్తోందని, ఆ పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేలటూరు జెట్టీకి సంబంధించిన అసంపూర్తి పనులను పూర్తి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, అదేవిధంగా.. అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలోనే మిగిలిన పనులు పూర్తి చేయించేందుకు ప్రయత్నిస్తునామని ఆయన తెలిపారు. రూ. 1.20 కోట్ల విలువైన డీప్ సీ బోట్లను 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం మత్స్యకారులకు అందజేస్తోందని, నుడా నిధులతో తీర ప్రాంతంలో హైమాక్స్ లైట్లు ఏర్పాటుకు కృషి జరుగుతోందని తెలిపారు. కోడూరు బీచ్ రోడ్డును బాగుచేయిస్తున్నామన్నారు. కృష్ణపట్నంలో ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టామని వివరించారు.

# జెన్-జి యువతతో కలసి అభివృద్ధి పనులు

## తనదైన శైలిలో ప్రారంభించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



జెన్‌జీ యువతతో అభివృద్ధి పనులని ప్రారంభింపజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

యువతరాన్ని అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేయాలని ఆకాంక్షిస్తూ, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల 17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 168 అభివృద్ధి పనులకు తనదైన శైలిలో జెన్‌జీ యువతతో ప్రారంభోత్సవాలు చేయించారు. 27వ డివిజన్ ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియం వద్ద 17 కోట్ల వ్యయంతో 168 అభివృద్ధి పనులను జెన్-జి యువత అయిన నలుగురు విద్యార్థినీ, విద్యార్థులు లోకేశ్వరి, లక్ష్మిజ్యోతి, హిరణ్ కుమార్, మౌర్యలతో కలసి ప్రారంభించారు. రానున్న రోజుల్లో యువతరం ఆకాంక్షలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి, యువత ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా స్థానిక శాసనసభ్యుడిగా పని చేస్తానని ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఏడాది క్రితమే రామలింగాపురం అండర్ బ్రిడ్జి రోడ్డుని 15 ఏళ్ళ యువకుడి చేత ప్రారంభింపచేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. 26 నెలల్లో నెల్లూరురూరల్ నియోజకవర్గంలో పూర్తయిన, జరుగుతున్న పనులకు, టెండర్లు పిలిచిన, టెండర్లు పిలవబోతున్న అభివృద్ధి పనుల విలువ అక్షరాలా 857 కోట్ల రూపాయలుంటుందని ఆయన తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జిలు, కో-క్లస్టర్ ఇంచార్జిలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# హోంమంత్రి అమిత్‌షాను కలసిన విపిఆర్, బిఎంఆర్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో పాటు పలువురు టీడీపీ ఎంపీలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏపీ రాజధాని 'అమరావతి' విజన్, అభివృద్ధి పురోగతి, భవిష్యత్తు ప్రాధాన్యతను వివరించే ప్రత్యేక కాఫీటేబుల్ పుస్తకాన్ని ఈ సందర్భంగా హోంమంత్రికి అందజేశారు. ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, బి.కె.పార్థసారథి, తెన్నేటి కృష్ణప్రసాద్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, చింతకాయల విజయ్ తదితరులు అమిత్‌షాని కలిసిన వారిలో ఉన్నారు.

## అమృత్ పథకం నివేదికని..

# లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎంపీ మాగుంట శీనయ్య



అమృత్ పథకం సమీక్షపై నివేదికను ఇటీవల ఆ కమిటీ ఛైర్మెన్.. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పట్టణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరాపై గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల కమిటీ సమర్పించిన 7వ నివేదికలోని సిఫార్సులపై ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించిన 11వ నివేదికను ఆయన లోక్‌సభలో చదివి వినిపించారు.

# లండన్‌లో మంత్రి నారాయణ పర్యటన



అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి నారాయణ నేతృత్వంలోని అధికారుల బృందం ఈనెల 10న లండన్ పర్యటనకు చేరుకుంది. ఆ భవనాల డిజైన్లు రూపొందించిన ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. అమరావతిలో నిర్మిస్తున్న అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల వెలుపలి డిజైన్లపై చర్చించారు. అసెంబ్లీ భవనం పైభాగంలో ఎత్తయిన టవర్ నిర్మాణంపై ప్రత్యేకంగా మాట్లాడారు.

# రాయితీ ధరలకు బీపీటీ బియ్యం

రైస్ మిల్లులు, రైతు బజార్ల ద్వారా రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా బీపీటీ బియ్యాన్ని రాయితీ ధరలకు విక్రయించేలాని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు రైస్‌మిల్లర్లని ఆదేశించారు. దీంతో, కిలో 62 రూపాయల విలువైన బీపీటీ స్టీమ్ బియ్యాన్ని రూ. 52కు, కిలో రూ. 58 విలువైన బీపీటీ పచ్చి బియ్యాన్ని రూ. 50కు విక్రయించనున్నారు.




# విలువను సృష్టించే ఆన్‌లైన్ విద్య : విద్యార్థి భవిష్యత్‌కు ఉపయోగపడే కోర్సులు!

ఇప్పటి ప్రపంచంలో విద్య అనేది కేవలం పాఠశాల గోడల మధ్య మాత్రమే ఉండే ప్రక్రియ కాదు. జ్ఞానం ఇప్పుడు ఇంటి గడప దాటి, ప్రతి విద్యార్థి చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లోకి చేరింది. ఆన్‌లైన్ విద్య (Online Learning) అనేది ఒక విప్లవం. అది అవకాశాలను సమానంగా అందించే వేదిక. అయితే, ఆన్‌లైన్‌లో వేలాది కోర్సులు ఉన్నప్పటికీ, వాటిలో నిజంగా విలువను పెంచేవి ఏవి? విద్యార్థి భవిష్యత్‌కు ఉపయోగపడే, నైపుణ్యాలను పెంచే, ఉద్యోగ అవకాశాలను విస్తరించే కోర్సులు ఏవి?.. ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఆన్‌లైన్ కోర్సులు విద్యార్థికి రెండు ముఖ్యమైన ప్రయోజనాలు ఇస్తాయి. ఒకటి–నైపుణ్యాల పెంపు, రెండవది–నిరంతర అభ్యాసం. ప్రపంచం వేగంగా మారుతున్నప్పుడు, విద్యార్థి కూడా తన నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకోవాలి. 'నిత్యనూతనమై నేర్చుకోవడం జీవనశైలిగా మారాలి" అనే భావన ఇప్పుడు అత్యంత అవసరం. ఒక విద్యార్థి తన భవిష్యత్‌ను నిర్మించుకోవాలంటే, ప్రతి సంవత్సరం కనీసం రెండు లేదా మూడు నైపుణ్యాలను నేర్చుకోవడం తప్పనిసరి. ఆన్‌లైన్ కోర్సులు ఈ ప్రయాణాన్ని సులభం చేస్తాయి.

**నైపుణ్యాలను పెంచే ఆన్‌లైన్ కోర్సులు : విద్యార్థి భవిష్యత్‌కు బలమైన పునాది**

ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన నైపుణ్యాలలో ఒకటి డిజిటల్ నైపుణ్యాలు (Digital Skills). ఇందులో డేటా అనలిటిక్స్, ప్రోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కోర్సులు ఉన్నాయి. ఇవి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను విస్తరించడమే కాకుండా, ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేస్తాయి. అలాగే, కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా విద్యార్థి భవిష్యత్‌లో కీలకపాత్ర పోషిస్తాయి. ఆన్‌లైన్‌లో ఉన్న Business Communication, Public Speaking, Writing Skills వంటి కోర్సులు విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. ఒక విద్యార్థి తన ఆలోచనలను స్పష్టంగా చెప్పగలిగితే, అతను ఏ రంగంలోనైనా విజయవంతం అవుతాడు. ఉదాహరణకు, Courseraలో ఉన్న "Improving Communication Skills" అనే కోర్సు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగపడింది. ఇంకా ఒక ముఖ్యమైన రంగండిజైన్ మరియు క్రియేటివిటీ (Design & Creativity). గ్రాఫిక్ డిజైన్ (Graphic Design), UI/UX Design, Video Editing, Animation వంటి కోర్సులు ఇప్పుడు అత్యంత డిమాండ్‌లో ఉన్నాయి. Canva, Figma, Adobe వంటి టూల్స్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఫ్రీలాన్స్ అవకాశాలను కూడా పొందగలరు.

**ప్రపంచ స్థాయి వేదికలు : విద్యార్థికి అందుబాటులో ఉన్న విశ్వవిద్యాలయాలు**

ఆన్‌లైన్ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన వేదికలు అనేకం ఉన్నాయి. వాటిలో Coursera, edX, Udemy, LinkedIn Learning, Khan Academy వంటి వేదికలు అత్యంత విశ్వసనీయమైనవి. Coursera మరియు edX ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలైన Harvard, MIT, Stanford, University of Michigan వంటి సంస్థల కోర్సులను అందిస్తాయి. ఒక విద్యార్థి ఇంట్లో నుంచే MIT ప్రొఫెసర్ బోధించే కోర్సు వినగలడంటే అది విద్యా ప్రపంచంలో ఒక అద్భుతం. Udemy వంటి వేదికలు ప్రాక్టికల్ నైపుణ్యాలను నేర్పడంలో ముందుంటాయి. ఉదాహరణకు, "Complete Web Development Bootcamp" లేదా 'Data Science A' వంటి కోర్సులు విద్యార్థికి నేరుగా ఉద్యోగ అవకాశాలను తెస్తాయి. LinkedIn Learning విద్యార్థి ప్రొఫైల్‌ను బలంగా నిర్మించడంలో సహాయపడుతుంది. ఒక విద్యార్థి LinkedInలో కోర్సు పూర్తిచేస్తే, అది అతని ప్రొఫైల్‌లో నేరుగా కనిపిస్తుంది, తద్వారా కంపెనీలు అతని నైపుణ్యాలను గుర్తిస్తాయి. భారతదేశంలో కూడా NPTEL, SWAYAM వంటి వేదికలు IIT\T, IISc వంటి సంస్థల కోర్సులను అందిస్తున్నాయి. ఇవి భారతీయ విద్యార్థులకు అత్యంత విలువైన వనరులు. ఉదాహరణకు, NPTELలో ఉన్న "Introduction to Machine Learning" కోర్సు వేలాది మంది విద్యార్థుల కెరీర్‌ను మార్చింది.

**నిరంతర అభ్యాసం : విద్యార్థికి తప్పనిసరి మార్గం :**

ఆన్‌లైన్ విద్య యొక్క అసలు శక్తి "నిరంతర అభ్యాసం" అనే భావనలో ఉంది. ఒక విద్యార్థి తన నైపుణ్యాలను సంవత్సరానికి ఒకసారి మాత్రమే కాదు..ప్రతినెలా, ప్రతి వారం, అవసరమైతే ప్రతి రోజూ నవీకరించుకోవాలి. ప్రపంచం వేగంగా మారుతున్నప్పుడు, విద్యార్థి కూడా అదే వేగంతో ముందుకు సాగాలి. ఉదాహరణకు, ఒక విద్యార్థి డేటా అనలిటిక్స్ నేర్చుకున్న తర్వాత, వెంటనే Power BI, Tableau వంటి టూల్స్ నేర్చుకోవచ్చు. ఆ తర్వాత Machine Learningలోకి వెళ్లవచ్చు. ఆ తర్వాత క్లౌడ్ కంప్యూటింగ్ నేర్చుకోవచ్చు. ఈ విధంగా నైపుణ్యాలను పొరలుగా నిర్మించుకుంటే, విద్యార్థి ప్రొఫైల్ బలంగా మారుతుంది. ఇది ఉద్యోగ అవకాశాలను విస్తరించడమే కాకుండా, విదేశీ విశ్వవిద్యాలయాలకు అప్లై చేసే సమయంలో కూడా భారీ ప్రయోజనం ఇస్తుంది.ఆన్‌లైన్ విద్యలో మరో ముఖ్యమైన అంశం స్వీయ నియంత్రణ (Self-Discipline). విద్యార్థి క్రమశిక్షణతో చదివితేనే అవి విలువను సృష్టిస్తాయి. ఒక విద్యార్థి ప్రతి రోజు ఒక గంట ఆన్‌లైన్ కోర్సులకు కేటాయిస్తే, ఒక సంవత్సరం తర్వాత అతని నైపుణ్యాలు పూర్తిగా మారిపోతాయి. ఆన్‌లైన్ విద్య అనేది ఒక సాధనం మాత్రమే కాదు; అది విద్యార్థి భవిష్యత్‌ను నిర్మించే శక్తివంతమైన మార్గం. సరైన కోర్సులను ఎంచుకుంటే, క్రమశిక్షణతో చదివితే, నిరంతర అభ్యాసాన్ని అలవాటు చేసుకుంటే..విద్యార్థి తన జీవితాన్ని పూర్తిగా మార్చుకోగలడు. ప్రపంచం మారుతున్న వేగానికి సరిపోయేలా, విద్యార్థి కూడా తన నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకుంటూ ముందుకు సాగాలి. ఇదే నిజమైన విలువను సృష్టించే ఆన్‌లైన్ విద్య.

**వచ్చే వారం :** విద్యార్థి భవిష్యత్‌కు 'డిజిటల్ వేదిక'.. 'లింక్డ్ ఇన్'ను ఉపయోగించే మార్గాలు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA



E-mail: reddyu@gmail.com

# పేదలకు వరం.. 'వీపీఆర్ నేత్ర'

## • 1,01,585 మందికి ఉచిత కంటి పరీక్షలు

కళ్లు మసకబారిపోకుండా, పేదల కంటిచూపును కాపాడాలనే సంకల్పంతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిల ఆధ్వర్యంలో వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న 'వీపీఆర్ నేత్ర' సేవలు ప్రజలందరి ప్రశంసలందుకుంటున్నాయి. గత ఏడాది నవంబర్ 3న ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం, ఇటీవల 1,01,585 ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, 59,195 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం విశేషం. ఉదయగిరి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 143 పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించి 47,434 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 26,423 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ప్రస్తుతం కోవూరు నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మొత్తం 82 పంచాయతీల్లో 57 పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించారు. ఇప్పటివరకు 31,731 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 21,319 మందికి కంటిఅద్దాలు అందజేశారు. అదేవిధంగా, ఆత్మకూరు నియోజకవర్గంలో కూడా ఈ సేవా కార్యక్రమం కొనసాగుతోంది. మొత్తం 136 పంచాయతీల్లో 61 పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించారు.

# నేతన్నల బాగే..ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ రవిచంద్ర



సత్కారాలు పొందిన మత్స్యకారులతో నాయకులు, అధికారులు

నేతన్నల బాగే ప్రభుత్వ లక్ష్యమని, చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు..ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చెప్పారు. 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన "నేతన్న సేవలో" కార్యక్రమంలో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుతో పాటు ఆయన పాల్గొన్నారు. బాపట్లలో నిర్వహించిన "నేతన్న సేవలో" పథకం కింద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరుజిల్లాలోని 4,793 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి 25 వేల రూపాయల వంతున జమ చేశారని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2017 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన జాతీయ చేనేత సభలో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని, అందులో భాగంగానే రాష్ట్రప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25వేల ఆర్థికసాయం, ప్రతినెలా వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ రామస్వామి, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు కె.బాలసుబ్రమణ్యం, వరప్రసాద్, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 'కలం కన్నీరు పెడుతోంది'..పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

ప్రముఖ కవి.. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు మురళీ మోహన్‌రాజు రచించిన 'కలం కన్నీరు పెడుతోంది' కవితాసంపుటిని ఇటీవల స్థానిక టౌనుహాలులో నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ సుజాత మాట్లాడుతూ, సామాజిక స్పృహ కలిగించే కవితలు రాసిన మురళీమోహన్ రాజును అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. స్థానిక ప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, డాక్టర్ కె.పెంచల రెడ్డి, యనమల నాగేశ్వరరావు, హరినారాయణ రెడ్డి, సత్యంజీ, వేమారెడ్డి, షేక్ కాలేషా, అండే శ్రీనివాసులు, తమ్మినేని పొందు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని కవిని అభినందించారు.

# జొన్నవాడలో నేత్రపర్వంగా..శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గ్రామోత్సవం

ఆడికృత్తిక సందర్భంగా ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో అద్భుతంగా అలంకరించి, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకపూజలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ, మంగళ వాద్యాల మధ్య స్వామివారు గ్రామ వీధులలో విహరించగా, భక్తులు పాల్గొని స్వామివారికి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.





## భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల వృషభార్చన..

బహుళ త్రయోదశి సందర్భంగా కామాక్షితాయి దేవస్థానంలో ఈనెల 10న వైభవంగా ప్రదోష కాల వృషభార్చన జరిగింది. దేవస్థానంలోని అధికార రాతి నందీశ్వరునికి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రదోషకాలంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయకమిషనర్ మరియు ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ చైతన్యవేదిక, విశ్వహిందూ పరిషత్ నాయకులు

# గోవింద నామాలను అపవిత్రం చేశారు

- మండిపడ్డ హిందూ చైతన్యవేదిక నాయకులు
- చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ శ్రీవేంకటేశ్వరుని గోవింద నామాలను పేరడీ చేసి అపహాస్యం చేశారంటూ వైసీపీ నాయకులపై హిందూ చైతన్యవేదిక, విశ్వహిందూ పరిషత్ నాయకులు మండిపడ్డారు. దీనివల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. అందుకు వైసీపీ నాయకులు పశ్చాత్తాపంతో క్షమాపణ చెప్పాలంటూ వారు నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత శనివారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరసన కార్యక్రమంలో భాగంగా, పవిత్ర గోవింద నామాలను మార్చి, పేరడీగా రూపొందించి వ్యంగ్యంగా పాడడం జరిగిందని వారు ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్మరించే పవిత్ర నామాలని రాజకీయ విమర్శలకు, వ్యంగ్యానికి ఉపయోగించడం హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచే చర్య అని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై హిందూ చైతన్య వేదిక మరియు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు నెల్లూరు చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, హిందూ సమాజానికి కలిగిన మనోవేదనకు బాధ్యులైన వైసీపీ నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచారం విభాగం అధ్యక్షులు కాకు మురళిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి ఏ.వి.ఆర్.మోహన్‌రావు మాట్లాడుతూ, వైసీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి క్షమాపణ చెప్పకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు తోటపల్లి సాయి శ్రీనివాస్, నగర అధ్యక్షులు కనగలూరు స్వామి, నగర ఉపాధ్యక్షులు జోరుగె మోహన్‌రావు, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహా గోరక్షా ప్రముఖ్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల భద్రతపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?



- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు

పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, ఉపాధ్యాయుల శిక్షణ, మాక్‌డ్రిల్స్, పాఠశాల విపత్తు నిర్వహణ ప్రణాళికలు, భద్రతా చర్యలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 11న లోక్‌సభలో లిఖితపూర్వకంగా కొన్ని ప్రశ్నలు అడిగారు. వీటికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ సమాధానం ఇచ్చారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) అమలుచేసిన నేషనల్ స్కూల్ సేఫ్టీ ప్రోగ్రామ్ (ఎన్ఎస్ఎస్‌పీ)ని 2011 జూన్‌లో రూ. 48.47 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించామని, ఈ పైలట్ ప్రాజెక్ట్ కింద 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 43 జిల్లాల్లో మొత్తం 8,600 పాఠశాలలను కవర్ చేసి, 2019 మార్చి నాటికి ఈ కార్యక్రమాన్ని ముగించినట్లు వివరించారు. ఎన్ఎస్ఎస్‌పీ

2019 మార్చితో పూర్తయినప్పటికీ, 2025-26 సంవత్సరంలో ఎన్‌డీఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాఠశాలల భద్రతా అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆరు రాష్ట్రాల్లోని ఆరు జిల్లాల్లో 1,793 పాఠశాలల్లో నిర్వహించిన పైలట్ కార్యక్రమాల ద్వారా 2.60 లక్షల మంది విద్యార్థులు, 54 వేల మంది ఉపాధ్యాయులకు భద్రతా విధానాలపై అవగాహన పెంచడం జరిగిందని వివరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన 13 వేల స్కూల్ సేఫ్టీ కార్యక్రమాల ద్వారా 43 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు.

## ఏపీలో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

దేశంలో స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ అమలు తీరు, 'స్కిల్ ఇండియా డిజిటల్ హబ్' నిర్వహణ వంటి పలు అంశాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 10న లోక్‌సభలో పలు ప్రశ్నలు అడిగారు. అందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, జన్ శిక్షణ్ సంస్థాన్ అనే మూడు ప్రధాన పథకాల ద్వారా అమలవుతోందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో 5.35 లక్షల మందికి పీఎం కేవైవై కింద శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 26 శిక్షణ కేంద్రాలు అందుబాటులో ఉండగా, మొత్తం 5,35,681 మంది అభ్యర్థులు శిక్షణ పొందారని తెలిపారు. వారిలో 4,28,660 మంది సర్టిఫికేషన్ సాధించారన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ కింద రాష్ట్రంలోని 1,135 సంస్థలలో 93,094 మంది అప్రెంటిస్‌లుగా చేరగా, 23,245 మంది సర్టిఫికెట్‌లు అందుకున్నారని, జన్ శిక్షణ్ సంస్థాన్ పథకం ద్వారా రాష్ట్రంలోని 6 క్రియాశీల సెంటర్ల పరిధిలో 84,506 మంది శిక్షణ పొందగా, 84,230 మంది సర్టిఫికేషన్ సాధించారని తెలిపారు. నెల్లూరుజిల్లాలో 5 శిక్షణ కేంద్రాలు పనిచేస్తుండగా, 6,091 మంది అభ్యర్థులు శిక్షణ పొందారని, 2,827మంది సర్టిఫికేషన్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఎన్ఏపీఎస్ పథకం కింద నెల్లూరు జిల్లాలో 64 సంస్థలు భాగస్వామ్యం వహించగా, 2,073 మంది యువకులు అప్రెంటిస్‌లుగా ఎంపికయ్యారని, వారిలో 591 మంది సర్టిఫికేషన్ సాధించారని కేంద్రమంత్రి వెల్లడించారు.

# గూడూరు డివిజన్



రెండేళ్ళ పాలనపై ఇంటింటి ప్రచారంలో భాగంగా ఇటీవల వాకాడు గ్రామంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాలను ప్రజలకు వివరిస్తున్న గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్

## గౌడ సంఘానికి నూతన కమిటి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శీనయ్యగౌడ్

గౌడ గీత కార్మికులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేలా అందరూ ఐక్యంగా కృషి చేయాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తరకాల శీనయ్య గౌడ్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో గౌడ సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రఘురామయ్యగౌడ్, నాగేశ్వరరావుగౌడ్, గౌరవ సలహాదారులుగా గోవర్ధన్‌గౌడ్, నారాయణ గౌడ్, అధ్యక్షులుగా రఘురామ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శంకరయ్యగౌడ్, ప్రధానకార్యదర్శిగా బాలకృష్ణగౌడ్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి

## ఇన్‌ఛార్జి మార్పుపై..
## వైకాపాలో అసంతృప్తి

గూడూరు వైకాపా ఇన్‌ఛార్జిని మార్చడంతో ఆ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి మొదలైంది. కనీస సమాచారం లేకుండా పార్టీ అధినాయకత్వం మేరిగ మురళీధర్‌ని మార్చి గూడూరు ఎంపీపీగా వున్న గురవయ్యని ఇన్‌ఛార్జిగా నియమించడంతో అసంతృప్తికి లోనైన పలువురు నాయకులు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళినా కూడా ఆయన మాట కూడా సంతృప్తిని ఇవ్వకపోవడంతో గూడూరు వైకాపా మండల పార్టీ అధ్యక్షులు మల్లు విజయకుమార్‌రెడ్డి నివాసంలో ఇటీవల గూడూరు పట్టణ, మండలం, చిల్లకూరు మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు సమావేశమై చర్చించారు.

అదేవిధంగా ఈ నెల 11వ తేదీన కోట మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటలోని రెడ్డి కళ్యాణ మండపంలో గూడూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విషయమై సమావేశం నిర్వహించారు.



భిక్షాటన పేరుతో బలవంతపు వసూళ్ళకి పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లకి కౌన్సిలింగ్ ఇస్తున్న గూడూరు రూరల్ ఇన్స్‌పెక్టర్, 1టౌన్, 2 టౌన్, చిల్లకూరు 1టౌన్ ఎస్.ఐలు

## ప్రపంచ అవయవదాన దినోత్సవ ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న శ్యాంయాదవ్, ఏరియా ఆసుపత్రి సిబ్బంది

శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు, జీవన్దాన్ ఆర్గాన్ డోనార్ డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ షరీన్ మరియు ఆర్ఎంఓ డాక్టర్ పి.ప్రసూన సహకారంతో, గవర్నమెంట్ హాస్పిటల్ నుండి క్లాక్ టవర్ వరకు ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న ర్యాలీ నిర్వహించి, అవయవ దానంపై ప్రజలకి అవగాహన కల్పించారు. వైద్యులు వెంకటాచలపతి, లక్ష్మీనారాయణ, శ్వేత, చారీస్మా మరియు నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మికాంతం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల జీతాలు



డాక్టర్ షరీన, ప్రసన్నలను సత్కరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గత ఆరు నెలలుగా వేతనాలు అందక బాధపడుతున్న కార్మికుల బాధను గమనించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీన, ఆర్ఎంఓ ప్రసన్నలు ఎట్టకేలకు కాంట్రాక్టర్ ద్వారా బకాయిలను అందజేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు వారిరువురికీ కృతజ్ఞతలు చెపుతూ శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సీవీఆర్ కుమార్, కే.నారాయణ, జీ.శశికుమార్, షేక్ జమాలుల్లా, వై.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలకి రిజర్వేషన్లు ఉండాలి

## • పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో బీఎంఆర్



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్(బీఎంఆర్) ఈనెల 12న 'పార్లమెంటరీ కమిటీ ఆన్ వెల్ఫేర్ ఆఫ్ ఓబీసీ'ల సమావేశాల్లో పాల్గొన్నారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసిల) సంక్షేమం, రిజర్వేషన్ విధానాల సమర్ధవంతమైన అమలు, క్రీమిలేయర్ నిబంధనలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీల ప్రాతినిధ్యం, విద్యా మరియు ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాల అమలుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) మరియు కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్) ప్రతినిధులు కమిటీకి సమగ్ర వివరాలను సమర్పించారు. సమావేశాల్లో ముఖ్యంగా ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ అమలు, క్రీమీ లేయర్ నిర్ధారణలో ఏకరీతి ప్రమాణాలు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్ర ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమానత్వ ప్రమాణాలు, రిజర్వేషన్ రోస్టర్ల నిర్వహణ, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, మరియు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఒబిసిల ప్రాతినిధ్యం పెంపుపై విస్తృతంగా చర్చ జరిగింది. బీద మస్తాన్‌రావు యాదవ్ మాట్లాడుతూ, ఓబీసీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కులు దేశవ్యాప్తంగా సమానంగా అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా క్రీమీ లేయర్ నిర్ధారణలో పారదర్శకత మరియు ఏకరీతి విధానం ఉండాలని, అలాగే కేంద్ర ప్రభుత్వంలోని అన్ని గ్రూపుల ఉద్యోగాల్లో ఒబిసిల ప్రాతినిధ్యం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒబిసి యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి, పరిశోధన, విదేశీ విద్య, మరియు స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చేలా కేంద్రప్రభుత్వ పథకాల విస్తరణకు కట్టుబడి పనిచేయాలని ఆయన కమిటీ దృష్టికి తీసుకువచ్చారు.

# అక్రమ కేసులకి భయపడం



- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని నెల్లూరు నగర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని వైస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న.. అనేక అక్రమాలను ఇటీవల కాలంలో తాము బయట పెట్టడం జరిగిందన్నారు. దాంతో రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. గోవింద నామాల పాట విషయంలో ఒక కార్యకర్త తన ఆవేదన వ్యక్తం చేస్తూ.. అలా పాట పాడారే తప్ప.. ఎక్కడా హిందూ మతాన్ని కానీ, దేవుళ్ళని గాని అవహేళన చేయలేదన్నారు. అక్కడ తానున్నప్పటికీ.. వారు పాడుతున్న పాటను తాను ఆలపించలేదన్నారు. నిజంగా తనవల్ల.. హిందువుల మనోభావాలు దెబ్బతిని ఉంటే.. తాను క్షమాపణ చెప్పడానికి కూడా వెనుకాడనన్నారు. తాను ఒక హిందువుగా.. దేవుళ్ళను ఎంతో నిష్టగా పూజిస్తుంటానని ఆయన వివరించారు.

# శ్రీసిటీని సందర్శించిన జర్మనీ కాన్సుల్ జనరల్



కాన్సుల్ జనరల్‌కు జ్ఞాపికనందజేస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

చెన్నైలోని జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో శ్రీసిటీ అంతర్జాతీయ పెట్టుబడిదారులకు అనువైన వేదికగా ఎదిగిందన్నారు. బెల్ ఫ్లేవర్స్ మరియు ఫ్రాగ్రెన్సెస్, నాఫ్, కాంక్యో బెర్ట్ వంటి జర్మన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, ఆధునిక మౌళిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ఈ సందర్భంగా మైఖేల్ హాస్పర్ ప్రశంసించారు. శ్రీసిటీ ఒక ప్రపంచస్థాయి పారిశ్రామిక నమూనాగా ఆయన అభివర్ణించారు. జర్మనీకి భారత్ కీలక వాణిజ్య భాగస్వామిగా పేర్కొన్న ఆయన, భారతదేశంలో విస్తరిస్తున్న మార్కెట్, పెట్టుబడి అనుకూల ప్రభుత్వ విధానాలు ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక సహకారానికి అపారమైన అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. అనంతరం ఆయన శ్రీసిటీలోని పలు జర్మనీ పరిశ్రమలను సందర్శిం అక్కడి సిబ్బందితో మాట్లాడారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరాధనోత్సవాలకు భారీ ఏర్పాట్లు

వెంకటాచలం మండలం గొలగమూడిలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి ఆశ్రమంలో ఈనెల18 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్న ఆరాధనోత్సవాలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారిచే నియమింపబడిన ఆశ్రమ కమిటీ వారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు కనీసం ఈసారి మూడు లక్షల మంది వరకు భక్తులు వస్తారని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా అవసరమైన కనీస వసతులు, గదులు, డార్మెటరీలతో పాటు మంచినీటి సౌకర్యాలు, స్వామి దర్శనానికి ఇబ్బందిలేకుండా క్యూలైన్లు వగైరాలన్నీ భక్తుల కోసం సిద్ధం చేస్తున్నట్లు ఆశ్రమ కమిటీవారు ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ ఆరాధన రోజున ఉదయం గంటలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు శ్రీ వెంకయ్యస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఆరాధన రోజున ఉదయం 10 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్పమహోత్సవం నేత్రపర్వంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయంలో జరిగే పూజలు, వాహనోత్సవాలతో పాటు ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేస్తున్నామని, టీటీడీవారిచే భజనలు, కోలాటం ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. నెల్లూరులోని కళాదీప్తి సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, 18, 23, 24 తేదీల్లో రాష్ట్రస్థాయి కళాకారులతో పౌరాణిక నాటకప్రదర్శనలు ఉంటాయని, భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తిచేశారు.

## నేదురుమల్లి ఆధ్వర్యంలో..

# కలువాయలో భారీ ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు

డీఎస్సీలో అక్రమాలు జరిగాయని, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలువాయలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో అక్రమంగా ఉద్యోగం పొందేలా ప్రత్యేక జీవో తీసుకొచ్చి పోస్టులు భర్తీచేసి మళ్లీ ఆ జీవోను రద్దు చేయడం డీఎస్సీలో అక్రమం కాదా అని ప్రశ్నించారు. 2014లో సీఎం చంద్రబాబు నిరుద్యోగ భృతి 2000 రూపాయలు ప్రకటించి ఇవ్వకుండా, 2024లో 3వేల రూపాయలను నిరుద్యోగ భృతిగా ఇస్తానని మళ్లీ నిరుద్యోగులను మోసం చేశారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టానని చెప్పుకునే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ అంశాలపైన ప్రశ్నించాలని సూచించారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తుంటే బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ బంద్ పిలుపునివ్వడం రాష్ట్రంలో పాలన బాగాలేదని కూటమి భాగస్వామి పార్టీ గుర్తించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాలకు తరలిరండి!





- ఎమ్మెల్యే కోటంరెడ్డికి సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం -

వినాయకచవితి సందర్భంగా వచ్చేనెల 14 నుంచి 24వ తేదీవరకు నెల్లూరు చంద్రమౌళినగర్‌లోని శ్రీ వేదగణపతి స్వామివారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగే గణపతి ఉత్సవాలకు వచ్చి స్వామివారిని దర్శించుకోవాలంటూ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ సభ్యులు నెల 12న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఉత్సవాల రోజుల్లో స్వామివారిని వివిధ రకాల అలంకారాలతో శోభాయమానం చేసి పూజలు నిర్వహిస్తామని, 14 నుంచి వరుసగా పుష్పాలంకరణ, చందనాలంకరణ, పీతాంబర అలంకరణ, కుంకుమాలంకరణ, ముత్యాల అలంకారాలతో స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా వేదగణపతిస్వామి వారి ప్రాంగణంలో విద్యాబుద్ధి ప్రదాయకుడైన శ్రీవిఘ్నేశ్వరుడిని 'సరస్వతీమాత అలంకారం'తో మరింత కన్నులపండువగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని, ఈ ఉత్సవాల్లో మీరు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కమిటీవారు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు.

# అద్వితీయ గీతం..'మా తెలుగుతల్లికీ మల్లెపూదండ'

## • శంకరంబాడి సాహితీ వైభవంలో వక్తలు



శంకరంబాడి సాహితీ సేవలను స్మరించుకుంటున్న వక్తలు

ప్రముఖ సాహితీవేత్త శంకరంబాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండ' పాట ఒక అద్వితీయ గీతమని, తెలుగుప్రజల గుండెల్లో అది శాశ్వత స్థానం పొందిందని పలువురు వక్తలు కొనియాడారు. చెన్నైలో..మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ మరియు జనని సాంఘిక సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల శంకరంబాడి జయంతి ఉత్సవాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండ', తమిళ్‌తాయ్ వాళ్తు ప్రార్థనలతో సభ ప్రారంభం కాగా, ముఖ్య అతిథులు డా. పాండురంగం కాళియప్ప స్వాగతోపన్యాసం చేశారు. ఆచార్య విస్తాలి శంకరరావు సభకి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, శంకరంబాడి వారి సాహిత్యం అపూర్వమన్నారు. సారస్వతలోకంలో ఆయనో గొప్ప శిఖరమని అభివర్ణించారు. ప్రముఖ సారస్వతవేత్తలు కాశీ సోమయాజుల రమణి, డా. నిర్మలా పళనివేలు మాట్లాడుతూ, శంకరంబాడి రచనలు తెలుగుదనంతో మూర్తీభవించినవని కొనియాడారు. 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండ–మా కన్నతల్లికీ మంగళారతులు' పాట తెలుగుతల్లి ముద్దుబిడ్డలకు ఎంతో ప్రీతికరమైనదన్నారు. సాహితీవేత్త గుడిమెట్ల చెన్నయ్య, ఆచార్య ఎల్‌బి శంకరరావు, డా. మాదా శంకరబాబు, డా. ఉడాలి విష్ణుప్రియ, డా.ఎన్ ఎలిజబెత్ జయకుమారి, డా. గూడూరు దయామణి, డా. తుమ్మపూడి కల్పన, డా.తిరుమల ఆముక్తమాల్యద, డా.జి. నళిని, మన్నవ గంగాధరప్రసాద్, తమ్మినేని బాబు తదితర సాహితీవేత్తలు పాల్గొని శంకరంబాడి రచనల వైశిష్ట్యాన్ని వివరించారు. ఆంధ్ర రచయితలలో శంకరంబాడి అగ్రగణ్యులన్నారు. సరోజినీ ప్రేమ్‌చంద్, ప్రభల జానకి, మామిడి మురళి, కృష్ణారావు, ఎరుకలయ్య, డా. ఆలూరి శివకుమారి, కమలాకర ఆనంద శివరామ్ రాజేశ్వరి, శ్రీనివాసరాజు, కృష్ణశాస్త్రి, ధనుంజయ్, నాగేశ్వరరావు తదితర ప్రముఖ కవులు, రచయితులు పాల్గొన్నారు.

# సమస్యల సాధనకి..పాదయాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న అరిగెల సాయి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని, సమస్యల సాధనకి ఇక నుంచి గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం, పాదయాత్రలు చేయడం జరుగుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లాశాఖ కార్యదర్శి అరిగెల సాయి చెప్పారు. ఈనెల 12 నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో పార్టీనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిగ్రామంలోనూ ఎంతోకాలంగా తీరని సమస్యలని అవగాహన చేసుకుని, వాటి పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలను అలక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు కె.చినవెంకయ్య, ఆదినారాయణ, జిలానీ, వెంకటసుబ్బయ్య, రఫీ,వేణు, జనార్దన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనువాద గ్రంథాలు

# అందరికీ అందుబాటులోకి రావాలి

**- ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు -**



సమావేశంలో పాల్గొన్న గారపాటి ఉమామహేశ్వరరావు, మాడభూషి సంపత్ తదితరులు

ప్రస్తుత కాలంలో అభివృద్ధి చెందిన సాంకేతికతతో ప్రాచీన గ్రంథాల యంత్రానువాదం కూడా సుసాధ్యమేనని ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు చెప్పారు. "తెలుగులో అనువాద సంప్రదాయం - విద్యానువర్తనం" అనే అంశంపై ఇటీవల వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో రెండు రోజుల సదస్సు జరిగింది. మంగళవారం ముగింపు సమావేశంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ, అంతర్జాలంలో తెలుగు వినియోగంతోనే భాష సుసంపన్నం అవుతుందని అన్నారు. అనువాద గ్రంథాలు సామాన్యులకు అందుబాటులోకి రావాలని, ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలను మాతృభాషలోనే ప్రచురించాలని కోరారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం కోసం భారతీయ రాజులు, సంస్కర్తలు చేసిన కృషిని, పోరాటాలను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 2020 జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తుందని తెలిపారు. డాక్టర్ సంగనభట్ల నరసయ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ జంధ్యాల శరత్ బాబు, డాక్టర్ భమిడిపాటి గౌరీశంకర్, డాక్టర్ కప్పగంతుల రామకృష్ణ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్ల ఆధ్వర్యంలో..

# 'టీబీ ముక్త భారత్ అభియాన్'


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎన్‌సిసి కేడెట్లు

నెల్లూరు వెంగళరావునగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్‌లో ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఇటీవల ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ, దేశంలో 66 శాతం కంటే ఎక్కువ మంది టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వీరు వైద్యచికిత్సలు చేయించుకుంటున్నారని తెలిపారు. టీబీ బారిన పడకుండా, ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి గురించి సరైన అవగాహనతో మెలగాలని, వ్యాధిగ్రస్తుల పట్ల మానవతా హృదయంతో సేవాభావంతో ఉండాలని క్యాడెట్లకి సూచించారు. టిబి వ్యాధిగ్రస్తులు లేని భారతదేశమే ప్రధాన లక్ష్యంగా 'టీబీ ముక్త భారత్ అభియాన్' పేరుతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారన్నారు. భారత ప్రభుత్వం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశంలో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి జరుగుతోందని ఎన్‌సిసి క్యాడెట్లకి, విద్యార్థులకి అవగాహన కలిగించారు.

## దేశాభివృద్ధి కోసం...

# ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలి

దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అనే నేను" కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈనెల 12న నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి "అనే నేను" కార్యక్రమాన్ని ప్రారంభించి తన అభిప్రాయాన్ని అందరితో పంచుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆరోజు నాటికి వ్యక్తిగా తాము, తమ ప్రాంతం, దేశం ఏవిధంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నారో తెలుపుతూ ప్రజలంతా సామాజిక మాధ్యమాల వేదికగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. అదేవిధంగా తమ ప్రాంత, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో తాను ఏవిధంగా భాగస్వామ్యం కావాలనుకుంటున్నారో తెలుపుతూ "అనే నేను" శీర్షికతో సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా తమ సంకల్పాన్ని తెలియజేయాలని, స్వాతంత్ర్య దినోత్సవంలోగా ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను తెలుపుతూ తమ సామాజిక మాధ్యమ అకౌంట్ల ద్వారా అభిప్రాయాలు తెలియజేయాలన్నారు.

# భగవంతుని భక్తితో ఆరాధించాలి

## సామవేదం షణ్ముఖశర్మ ఉద్బోధ



భగవంతుడిని భక్తితో ఆరాధించాలని, ఆ దేవుని అనుగ్రహం ఉన్నప్పుడే మన కష్టాలు, సమస్త పాపాలూ తొలగిపోతాయని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ చెప్పారు. నెల్లూరు పురమందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా రెండోరోజైన ఈనెల 12న ఆయన 'హరిహర వైభవం' గురించి అద్భుతంగా ఉపన్యసించి భక్తులకు ఆ పరమేశ్వరుని దివ్యత్వాన్ని తెలియపరిచారు. శివ-కేశవులు ఒక్కరేనని, వారిలో ఎలాంటి భేదం లేదని విశదీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ ప్రతాప్‌రెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటు నివారణ మాత్రల పంపిణీ


వాకర్స్‌తో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు


నెల్లూరులోని ఏసీ స్టేడియంలో ఈనెల 12న వాకర్స్‌కి గుండెపోటు నివారణకు ప్రాథమిక చికిత్సగా ఉపయోగపడే లోడింగ్ డోస్ కిట్‌లను పంపిణీచేశారు. స్థానిక శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు సౌజన్యంతో ఈ మాత్రల కిట్‌లను సుమారు వెయ్యిమందికి అందించామని, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు సీవీఎస్ శ్రీనివాసరాజు ఈ సందర్భంగా గుండెజబ్బుల గురించి వివరించారని వాకర్స్ నాయకులు..203 డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, వీరిశెట్టి హజరత్ బాబు, దాసరి అనంతరామారావు, ప్యానం రవిచంద్ర, షేక్ నజీర్ అహ్మద్, జె.వసుంధరాదేవి, ఎస్‌డి ఖమ్రుద్దీన్, సురేష్, కొండారెడ్డి, బుజ్జిరెడ్డి, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో.. కాత్యాయనీ వ్రతం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరమ్మవారి దేవాలయంలో ఈనెల 11న కాత్యాయనీ వ్రతాన్ని నిర్వహించారు. సౌభాగ్యం, జాతక దోషాలకి నివారణ, అన్యోన్య దాంపత్యం వంటి శుభాలు కలిగేందుకు ఈ వ్రతాన్ని ఆలయంలో ప్రతి మంగళవారం చేస్తున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో ఈ వ్రతాన్ని ఆచరించారు. తొలుత, ఆలయంలోని మూలవర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## టూకీగా...



### చిల్లకూరులో 'జ్ఞానజ్యోతి'పై శిక్షణ

మండలకేంద్రమైన చిల్లకూరులో జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ సారథ్యంలో 3రోజుల శిక్షణ జరిగింది. ఆటపాటలతో కూడిన విద్యనందించడం ద్వారా చిన్నారుల్లో జ్ఞానజ్యోతిని వెలిగించవచ్చని తెలిపారు. ఎంఇఓ రవూఫ్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

### పెరమనలో 'సర్'పై ప్రత్యేక డ్రైవ్

సంగం మండలం పెరమనలో ఈనెల 11న తహశీల్దార్ సారంగపాణి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సవరణల ప్రక్రియ (సర్)పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. క్లెయిమ్‌లు-అభ్యంతరాలు, ఓటర్ల నుంచి వినతులు స్వీకరించారు. ఓటరు కార్డు లేనివారు, కొత్తగా ఓటుహక్కు నమోదుచేసుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హత ఉన్నవారికి ఓటుహక్కు కల్పిస్తామని తెలిపారు.

### చేజర్లలో పశువుల వ్యాధి నివారణకి టీకాలు

మండలకేంద్రమైన చేజర్లలో ఈనెల11న పశువులకు లంపీస్కిన్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు. కలువాయి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చేజర్ల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు. పాడిరైతులకు ఈ సందర్భంగా పశువుల పెంపకం పట్ల వారు అవగాహన కలిగించారు.

### చలంచర్లలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు

కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామంలోని పాఠశాలలో ఈనెల 11న రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్‌జీ భానుమహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, తగు వైద్యసలహాలిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు మస్తానయ్య, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### రాపూరులో 11 నుంచి ఆధార్ క్యాంపులు

రాపూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఈనెల 11 నుంచి 14వరకు, సీపీకె ప్రభుత్వ కళాశాలలో 17 నుంచి 20వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేయించుకునేవారు, ఆధార్‌లోని వివరాలను సరిచేయించుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వసుంధరమ్మ సూచించారు.

### సోమశిలలో రోడ్డుభద్రతపై అవగాహన

అనంతసాగరం మండలం సోమశిల హైస్కూలులో ఈనెల 11న విద్యార్థులకు ఆత్మకూరు మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై అవగాహన కలిగించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించుకోవచ్చన్నారు. ఎంఇఓ ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### వెంకట్రావుపల్లిలో పర్యావరణం పట్ల సూచనలు

ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లి జడ్పీ స్కూల్‌లో ఈనెల 11న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులకు వింజమూరు ఎకో క్లబ్‌వారు మొక్కలు నాటి పెంచడం పట్ల సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ నిర్వాహకులు పురుషోత్తం, శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కలిగిరిలో..సైబర్ నేరాలపై డీఎస్పీ సమీక్ష

కలిగిరి సర్కిల్ కార్యాలయంలో ఈనెల 11న డీఎస్పీ పీవీ రమణకుమార్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై సమీక్ష జరిగింది. సైబర్ మోసాలలో పడి అమాయకులు డబ్బు పోగొట్టుకుంటున్నారని, ఆ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆయన పోలీసులకు సూచించారు. ఈ సమీక్షలో సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### గుడ్లూరువారిపాలెంలో 'పొలం పిలుస్తోంది'

వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాలెంలో ఈనెల 11న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో రైతులకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులు విశిష్ట గుర్తింపు(ఫార్మర్ ఐడీ) కలిగి ఉండాలని సూచించారు. ఏడీఏ శ్రీదేవి, ఎంపీఏఓ ఎస్.రామ్మోహన్, వీఏఏ ఎస్‌కె రఫీ పాల్గొన్నారు.

## సొంత శాఖలో 'లేటు వీరుల' పై..

# కొరడా ఝుళిపించిన కలెక్టర్ హిమాన్షు శుక్ల

## ➤ మిగిలిన శాఖలపైన కూడా దృష్టి పెట్టాలి

**ప్రభుత్వ కార్యాలయాలంటే ప్రజలకు సేవలందించే కేంద్రాలు. అక్కడ పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రజల నుంచి జీతం తీసుకుంటున్నాడనే భావన కంటే, ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందనే స్పృహతో పనిచేయాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపించడం కొత్తేమీ కాదు. నిర్ణీత సమయానికి కార్యాలయాలకు హాజరు కాకపోవడం, ఆలస్యంగా వచ్చినా పట్టించుకునే వారెవరూ లేకపోవడం, ఉన్నతాధికారులు సైతం సమయ పాలనను పెద్దగా పట్టించుకోకపోవడం వంటి ధోరణులు ప్రభుత్వ కార్యాలయాల్లో చాలాకాలంగా కొనసాగుతున్నాయి. ఈ నిర్లక్ష్యపు వ్యవహార శైలిపై నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తీసుకున్న చర్య చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆయన ఉదయం 10 గంటలకల్లా కలెక్టర్ కార్యాలయానికి తాళాలు వేయించి, ఆ సమయానికి కార్యాలయానికి రాని సిబ్బందిని బయటే నిలబెట్టడం, అనంతరం వారిని పిలిపించి మందలించి విధుల్లోకి అనుమతించడం సాధారణ చర్యగా చూడలేం. సమయపాలన విషయంలో ప్రభుత్వ యంత్రాంగానికి ఇచ్చిన గట్టి హెచ్చరికగా దీనిని భావించాలి.**



గేటుకి తాళం వేయిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల (ఏఐ ఆధారిత చిత్రం)

ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి కార్యాలయ వేళలు తెలియనివి కావు. అయినప్పటికీ సమయానికి కార్యాలయానికి రావడం కొందరికి ఇప్పటికీ ఒక బాధ్యతగా కాకుండా ఐచ్ఛికంగా మారడం విచారకరం. ప్రైవేటు రంగంలో ఉద్యోగి నిమిషం ఆలస్యమైనా హాజరు నమోదు, పనితీరు, జవాబుదారీతనం వంటి అంశాలు కఠినంగా అమలవుతాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం ఉద్యోగ భద్రత ఉందనే ధీమాతో సమయపాలనను తేలికగా తీసుకునే పరిస్థితి ఏర్పడటం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

అయితే ఇది కేవలం కలెక్టర్ కార్యాలయానికే పరిమితమైన సమస్య కాదు. రిజిస్ట్రేషన్, రవాణా, రెవెన్యూ, రోడ్లు-భవనాలు, నీటిపారుదల, పంచాయతీరాజ్, మున్సిపల్, సంక్షేమ శాఖలు... ఇలా ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న అనేక ప్రభుత్వ విభాగాల్లోనూ సమయపాలన, హాజరు, ప్రజలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలపై తరచూ ఫిర్యాదులు వినిపిస్తునే ఉంటాయి.

ప్రభుత్వ కార్యాలయం తెరుచుకునే సమయానికి అధికారి, సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు గంటల తరబడి సిబ్బంది కోసం ఎదురుచూడాల్సి వస్తే ప్రభుత్వ సేవలపై నమ్మకం దెబ్బతింటుంది. ఒక చిన్న ధ్రువీకరణ కోసం వచ్చిన వ్యక్తి నుండి భూమి సమస్యతో వచ్చిన రైతు వరకు, రవాణా సేవ కోసం వచ్చిన వాహనదారుడి నుంచి ఆస్తి రిజిస్ట్రేషన్ పనిమీద వచ్చిన సామాన్యుడి వరకు... ప్రతి ఒక్కరి సమయం విలువైనదే.

అందుకే కలెక్టర్ హిమాన్షు శుక్లా తీసుకున్న చర్య ఒక కార్యాలయానికి సంబంధించిన పరిపాలనా నిర్ణయంగా మాత్రమే మిగిలిపోకూడదు. ఇది జిల్లా మొత్తం ప్రభుత్వ యంత్రాంగానికి ఒక సందేశంగా మారాలి. సమయానికి కార్యాలయానికి రావడం ఉద్యోగి కనీస కర్తవ్యం. ప్రజలకు సమయానికి సేవ అందించడం ప్రభుత్వ వ్యవస్థ కనీస బాధ్యత.

ఇక్కడే జిల్లా కలెక్టర్ మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కలెక్టర్ కార్యాలయంలో అమలు చేసిన సమయ పాలనను జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు విస్తరించాలి. ప్రతి శాఖాధిపతి తన కార్యాలయంలో సిబ్బంది హాజరు, సమయపాలన, ప్రజలకు అందుబాటు వంటి అంశాలను పర్యవేక్షించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. ఆలస్యంగా వచ్చే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే వ్యవస్థను బలోపేతం చేయాలి.

అదే సమయంలో చర్యలు కేవలం కింది స్థాయి సిబ్బందిపైనే కాకుండా అన్ని స్థాయిల్లో సమానంగా ఉండాలి. ఉన్నతాధికారి ఆలస్యంగా వస్తే కింది స్థాయి ఉద్యోగుల నుంచి సమయపాలనను ఆశించడం నైతికంగా సబబు కాదు. సమయపాలన శాఖాధిపతితో ప్రారంభమైతేనే యంత్రాంగంలో క్రమశిక్షణ బలపడుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ అటెండెన్స్ వంటి సాంకేతిక వ్యవస్థలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వాటిని కేవలం హాజరు నమోదు కోసం కాకుండా పర్యవేక్షణ, జవాబుదారీతనం కోసం కూడా సమర్థంగా వినియోగించాలి. శాఖల వారీగా హాజరు పరిస్థితిని సమీక్షించి, నిరంతరం ఆలస్యంగా వచ్చే సిబ్బందిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

అయితే, క్రమశిక్షణ అంటే కేవలం తాళాలు వేయడం, సిబ్బందిని బయట నిలబెట్టడం మాత్రమే కాదు. సమయానికి వచ్చే ఉద్యోగికి సమయానికి పని వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు, స్పష్టమైన బాధ్యతలు కూడా కల్పించాలి. ప్రజలకు సేవలందించడంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలి. అప్పుడు మాత్రమే పరిపాలనా సంస్కరణకు అర్థం ఉంటుంది.

నెల్లూరు జిల్లా కలెక్టర్ తీసుకున్న ఈ చర్య అందుకే అభినందనీయం. సొంత కార్యాలయంలోనే మొదట కొరడా ఝుళిపించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచే ప్రయత్నం కనిపిస్తోంది. ఇప్పుడు అదే దృఢత్వం జిల్లాలోని మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలపైనా కనిపించాలి.

ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు, సిబ్బంది కోసం వేచి ఉండటానికి వెళ్లరు. తమ సమస్యలకు పరిష్కారం కోసం వెళ్తారు. వారి సమయాన్ని వృథా చేయడం అంటే వారి హక్కును నిర్లక్ష్యం చేయడమే.

కాబట్టి కలెక్టర్ హిమాన్షు శుక్లా తీసుకున్న సంచలనాత్మక చర్య ఒకరోజు వార్తగా ముగియకుండా జిల్లా ప్రభుత్వ యంత్రాంగంలో సమయపాలనకు శ్రీకారం చుట్టిన మలుపుగా మారాలి. ప్రతి శాఖాధిపతి తన కార్యాలయాన్ని సమయ పాలనకు, జవాబుదారీతనానికి, ప్రజా సేవకు ఆదర్శంగా తీర్చిదిద్దేలా కలెక్టర్ పర్యవేక్షణ ఉండాలి. ఒక కార్యాలయానికి తాళాలు వేయడం హెచ్చరిక కావచ్చు. కానీ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమయపాలనను ఒక సంస్కృతిగా మార్చినప్పుడే అసలైన మార్పుకి అర్థం... పరమార్థం...!

---

# గ్రంథాలయాలకి.. వీడని గ్రహణం!




**జిల్లాలోని ప్రభుత్వ గ్రంథాలయాలు ఎంతోకాలంగా నిధులు లేక, అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంటున్నాయి. గ్రంథాలయాలకి స్థానిక సంస్థల నుంచి కోట్లాది రూపాయలు సెస్సులుగా రావాల్సి ఉన్నా, సంబంధిత అధికారులు ఆ బకాయిలను ఏళ్లతరబడిగా చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు ఏళ్ళ తరబడిగా అభివృద్ధికి దూరమైపోతున్నాయి. ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లిస్తామని హామీలైతే ఇస్తారు తప్ప..ఆ నిధులు ఇప్పటికీ సక్రమంగా రావడమే లేదు. దీంతో గ్రంథాలయాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడనే ఉన్నట్లుంది.**

నెల్లూరుజిల్లా అంటేనే విద్యకి నిలయం. ఎందరో విద్యావేత్తలున్న విద్యాభూమిగా పేరు. అందుకు తగ్గట్టుగా ప్రజలకి విజ్ఞానాన్ని అపారంగా అందించే గ్రంథాలయాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ గ్రంథాలయాలు 60కి పైగానే ఉన్నాయి. జిల్లాకేంద్రమైన నెల్లూరులో కేంద్రగ్రంథాలయం ఉంది. ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. కానీ, ఏళ్ళ తరబడిగా జిల్లా అధికారుల నుంచి సహకారం లేకపోవడంతో, రావాల్సిన కోట్లాది రూపాయలు రాక, గ్రంథాలయాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారింది. ఒక్క నెల్లూరు నగర కార్పొరేషన్ నుంచే సుమారు 5 కోట్ల రూపాయల సెస్సు బకాయిలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఊహించుకోవచ్చు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల్లో, గ్రంథాలయాలకి కూడా వాటా సెస్సుల రూపంలో స్థానికసంస్థలు చెల్లించాల్సి ఉంది. ఆ వచ్చే నిధులతోనే గ్రంథాలయాలకి సంబంధించిన అభివృద్ధి పనులు జరగాలి. కానీ ఆ నిబంధనలేమీ పట్టించుకోకుండా, గ్రంథాలయాల సెస్సులు చెల్లించేందుకు సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కబెడుతుండడంతో అవి అంధకారంలో మగ్గిపోతున్నాయి.

### అభివృద్ధికి ఆమడదూరంలో..

జిల్లాలోని స్థానిక సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు చూస్తే.. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ నుంచే సుమారు 5కోట్లు దాకా రావాల్సి ఉన్నట్లు సమాచారం. అదే విధంగా కావలి మునిసిపాలిటీ నుంచి 2 కోట్లు గూడూరు మునిసిపాలిటీ నుంచి కోటికి పైగానే సెస్సు బకాయిలు రావాల్సి ఉంది. మునిసిపాలిటీలైన వెంకటగిరి నుంచి 85 లక్షలు, నాయుడుపేట నుంచి 78 లక్షలు, ఆత్మకూరు నుంచి 55 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీనుంచి 30 లక్షలకు పైగానే సెస్సు బకాయిలున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా సుమారు 50 కోట్లకి పైగానే బకాయిల నిధులు రాకపోవడం, మరోవైపు ప్రభుత్వం నుంచి ఎప్పుడో తప్ప గ్రాంట్ లేకపోవడంతో జిల్లాలో గ్రంథాలయాలు ఎంతోకాలంగా సమస్యల వలయంలోపడి అల్లాడుతున్నాయి. అటు గ్రంథాల భద్రతకు, ఇటు భవనాల మరమ్మతులకు కూడా నిధులు లేక జిల్లాలో అనేక గ్రంథాలయాలు నీరసపడిపోతున్నాయి.

### శిథిలమవుతున్న సరస్వతీ నిలయాలు..

గ్రంథాలయాలంటే ప్రజలకు, పాఠకులకు విజ్ఞానాన్ని అందించే సరస్వతీ నిలయాలు. కానీ, ఆ ఆలయాల వెలుగు జిల్లాలో క్రమేణా మసకబారిపోతుంది. జిల్లా ఉన్నతాధికారులు కానీ, ప్రభుత్వం కానీ వీటిపై శ్రద్ధ పెట్టకపోవడంతో అనేక గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. జిల్లా కేంద్రమైన నెల్లూరు కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికే నిధులు లేక దిక్కులేని పరిస్థితిలో ఉందంటే అతిశయోక్తి కాదు. అది చాలాకాలంగా అసంపూర్తిగానే ఉంది. దాని నిర్మాణం పూర్తి కావాలంటే కనీసం 4 కోట్ల రూపాయలైనా అవసరం ఉంటుందని అంచనా. కానీ.. నిధులిచ్చేవారే లేరు. జిల్లాలో దాదాపు 20కి పైగా గ్రంథాలయాలు శిథిలావస్థకి చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియక.. బిక్కుబిక్కుమంటున్నాయి. మరోవైపు, భద్రపరుచుకునే వసతులు లేక అనేక గ్రంథాలయాల్లో లక్షలాది గ్రంథాలు ఇప్పటికే చెదపురుగులకి ఆహారమైపోతున్నాయి. ప్రజలకు విజ్ఞానాన్ని ప్రసాదించే గ్రంథాలయాలు ఇంతటి దుర్గతికి చేరుకుంటుండడం బాధాకరం!.. ఈ పరిస్థితుల్లో గ్రంథా లయాలకి పట్టిన గ్రహణం ఇక ఎప్పుడు వీడిపోతుందో ఆ దేవుడికే తెలియాలి మరి!...

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com